UESI
ANDHRA PRADESH

# విద్యార్థి జ్వాల

Vol. 29 - No.9

July 2023

Rs. 12/- per copy



## కళాశాలలో కాంతిరేఖ

ఎడిటోరియల్

# నీ ప్రభావం ఏది?

"కాలేజీలో చేరాను, లేజీగా మారాను, నామోజు తీరిందిగా, బూజెంతో చేరిందిరో బాసు, చదువంతా లూజయిందిరో" అంటూ జక్కి దేవరాజు గారు రాసిన పాట కాలేజీ విద్యార్థుల జీవితానికి అద్దం పడుతుంది. టీనేజ్‌లో మొట్టమొదటి సారి కాలేజిలోకి అడుగు పెట్టేవారికి ఆ వాతావరణం ఎంతో కలర్‌ఫుల్‌గా, అందంగా, ఆహ్లాదంగా కనిపిస్తుంది. క్లాసుల్లో చేసే అల్లరి, క్యాంటీన్‌లో చెప్పుకొనే కబుర్లు, వేలంటైన్స్ డే, ఫ్రెండ్‌షిప్ డే లాంటి ఫంక్షన్స్‌లో చేసే సందడి అంతా ఇంతా కాదు. చదవడం కోసం పడే కష్టాలు, చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మరచి పార్క్‌లో చేసే షికార్లు, ఒకే సీసాలో రెండు స్ట్రాలు వేసుకొని కూల్‌డ్రింక్స్ తాగడం, రయ్.. రయ్.. అంటూ బైక్‌లపై దూసుకెళ్ళడం ఇలా ఎన్నో ఎన్నెన్నో. కాలేజీ కొందరికి విద్యాలయంలాగా అనిపిస్తే, కొందరి కి ప్రేమాలయంలా అనిపిస్తుంది. స్నేహానికి ఎల్లలు ఉండవు. స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం అంటూ ఆడుకొంటారు, ఆదుకొంటారు, వాడుకొంటారు, వదిలేస్తారు. పైకి నవ్వుతూ, తుళ్ళుతూ కనిపించినా అర్థరహితంగా జీవిస్తూ, ఆంతర్యంలో అంతులేని చీకటి గాథలతో జీవితాన్ని వెళ్ళదీస్తూ ఉంటారు.

చీకటి అనే పదానికి సంస్కృతంలో అంధకారం, తమస్సు, తిమిరం, మబ్బు అనే పేర్లు ఉన్నాయి. వెలుతురు ప్రవేశించని ప్రదేశాన్ని చీకటి అంటారు. చీకటి ఎక్కువగా ఉంటే కారుచీకటి అని అంటారు. ఆధ్యాత్మికంగా ఆలోచిస్తే నేటి కళాశాల విద్యార్థుల జీవితాల్లో కారు చీకటి కమ్ముకుంది. ఎందుకంటే వారి హృదయాల్లో వెలుగైన క్రీస్తుకు స్థానం లేదు. ఈ లోకపరమైనవి ఎన్ని ఉన్నా వారి హృదయం, మనసు అంధకారంతో నిండి ఉన్నాయి (రోమా 1:22). కారుచీకట్లో ఉన్న కళాశాల విద్యార్థులకు వెలుగైన క్రీస్తును పరిచయం చేయాలి. ఈ బాధ్యత క్రీస్తును అంగీకరించిన ఇయు విద్యార్థి మీదే ఉంది. తన కళాశాలలో జరిగే చీకటి పనులకు సమ్మతించకుండా, వెలుగుగా ప్రభావవంతమైన జీవితం జీవిస్తూ, తోటి విద్యార్థులకు క్రీస్తును పరిచయం చేయాలి.

సోక్రటీస్ 40 సం॥లు, ప్లేటో 50 సం॥లు, అరిస్టాటిల్ 40 సం॥లు బోధించగా, యేసుక్రీస్తు కేవలం $3^{1/2}$ సం॥లే బోధించాడు. అయినా ఈ ప్రపంచంపై ఈ ముగ్గురు గొప్ప తత్వవేత్తలు కలిసి ఉమ్మడిగా చూపించిన ప్రభావం కంటె యేసుక్రీస్తు చూపించిన ప్రభావం అనేక రెట్లు గొప్పది. గనుక ఎవరైనా వారున్న చోట ప్రభావం చూపించాలని ఆశపడితే అనుసరించడానికి క్రీస్తుయేసు కన్నా గొప్ప మాదిరి ఈ భూమి మీద మరెవ్వరూ లేరు. ఎవరైతే యేసుక్రీస్తును విశ్వసించి, ఆయన జీవితాన్ని మాదిరిగా తీసుకొని, ఆయన మాటలకు అనుగుణంగా తమ జీవితాలను మార్చుకొన్నారో వారు తమ సమాజాలలో, ప్రపంచం మీద గొప్ప ప్రభావాన్ని చూపించారు. ఇది చరిత్రలో నిరూపించబడిన గొప్ప సత్యం. క్రీస్తు శిష్యులు, అపొస్తలుడైన పౌలు, సెయింట్ అగస్టీన్, మార్టిన్ లూథర్, మార్టిన్ లూథర్ కింగ్, మదర్ థెరిస్సా, పండిత రమాబాయి, డేవిడ్ లివింగ్‌స్టన్, విలియం కేరీ, బిల్లీగ్రేహం, సియస్ లూయిస్, జాన్‌స్టాట్, భక్త్‌సింగ్ మొ॥వారి జీవితాల ను పరిశీలిస్తే మనకు అర్థమవుతుంది.

ఇయు విద్యార్థిగా నీ కళాశాలలో నీవు ఒక్కడివే కావచ్చు, నీవు ఉండేది మూడు లేదా నాలుగు సంవత్సరాలే అయినప్పటికీ క్రీస్తు జీవితాన్ని, పరిచర్యను మాదిరిగా తీసుకొంటే నీవున్న కళాశాలలో గొప్ప ప్రభావాన్ని చూపించవచ్చు. క్రీస్తు సాక్షిగా జీవిస్తూ, చదువులో రాణిస్తూ, వ్యక్తిగత సువార్త చేస్తూ, తప్పుడు విధానాలకు రాజీపడకుండా ఉండవచ్చు. ఖాళీ సమయంలో ప్రేయర్‌సెల్ ఏర్పాటు చేయవచ్చు. విద్యార్థులను బైబిల్ స్టడీకి, క్యాంప్స్‌కు ఆహ్వానించవచ్చు, ఓపెన్ ఫోరమ్స్ ఏర్పాటు చేయవచ్చు. "తమ దేవునిని ఎరుగువారు బలము కలిగి గొప్ప కార్యాల్ని చేస్తారు" (దాని 11:32).

*చరిత్ర పుటల్లో నీ గురించి ఒక పేజీ కూడా నింపకుండా*
*కనీసం నీవు వచ్చి వెళ్ళిన జాడలేవీ వదలకుండా*
*ఈ లోకాన్ని (నీ కాలేజీని) వదిలి వెళ్తావా? – డా. తాళ్ళూరి ప్రసాద్*

**– పి. సునీల్ జాకబ్**




Vol. 29, No.9 July 2023
A Publication of
UESI Publication Trust




"...మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన
తన వెలుగులోనికి మిమ్మును పిలిచిన వాని
గుణాతిశయములను ప్రచురము చేయు
నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన
యాజక సమూహమును, పరిశుద్ధ జనమును,
దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు."

-1 పేతురు 2 : 9

## లోపలి పేజీల్లో...


- నీ ప్రభావం ఏది? - 2
- స్వేదాన్ని చిందిద్దాం - 4
- కళాశాలలో కాంతిరేఖ - 5
- నా కళాశాలే నా సేవాపొలం - 8
- ఏది నీ ఎంపిక? - 10
- విజయానికి ఏడు మెట్లు - 11
- క్రైస్తవ సిద్ధాంతం - 14
- పై చేయి నాదే - 17
- ఉన్నత స్థితికి చేరుకోవాలంటే... - 19
- ఇగ్నేషియస్ - 22
- ఒప్పుకొందామా? కప్పుకొందామా? - 24
- దేహ నిర్వహణ - 27
- దిద్దుబాటు లేకపోయినా.. - 29
- అలవాట్లతో పొరపాట్లు వద్దు - 30
- కోశాధికారి లేఖ - 31
- ప్రభూ... మళ్ళీ నాకియ్యవా! - 32



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com



GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**


TOPICS:

August: UESI Cutting Edge
September: Unity
October: Power through Prayer
November: Fear of God
December: The Uniqueness of Jesus Christ

**Note:** Please send your writeups on or before
**10th of every month**

# స్వేదాన్ని చిందిద్దాం

"స్వప్నాలు సాకారమవ్వాలంటే స్వేదాన్ని చిందించాలి" అనే మాట కేరళ రాష్ట్రంలోని మలబార్ జిల్లాకు చెందిన కాజల్ రాజు (24 సంవత్సరాలు) జీవితాన్ని చూస్తే స్పష్టమవుతుంది. ఈ సంవత్సరం విడుదలైన యూపీయస్సీ సివిల్ సర్వీసెస్ ఫలితాలలో కాజల్, ఆల్ ఇండియా స్థాయిలో 910 వ ర్యాంకును సాధించడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. కుడిచేతి మణికట్టు లేకుండా జన్మించిన ఈ అమ్మాయి ఆత్మ విశ్వాసంతో కెరీర్ పరంగా ముందడుగులు వేసింది, పట్టుదలతో తన లోపాలను అధిగమించి సక్సెస్ సాధించింది. తన సక్సెస్‌కు కారణం చిన్నప్పుడే కలెక్టర్ కావాలనే ప్రగాఢమైన కోరిక, ప్రతిజ్ఞతో కూడిన లక్ష్యం, పట్టుదలతో కూడిన ప్రయాసే. ఫలితంగా, తొలి ప్రయత్నంలోనే సివిల్స్‌కి అర్హత సాధించింది.

అలాంటి అమ్మాయికే జీవితంలో పైకి రావాలని పట్టుదల ఉంటే, కళాశాలలో, విశ్వవిద్యాలయాల్లో విద్యాభ్యాసం చేస్తూ, పట్టభద్రులుగా ఉన్న మన యుఇయస్ఐ కుటుంబ సభ్యుల సంగతేంటి? మణికట్టు లేని అమ్మాయే మంచి క్రమశిక్షణతో గొప్ప లక్ష్యాన్ని సాధిస్తే, అన్నీ ఉన్న మనం ప్రభువు కోసం అద్వితీయమైన జీవితం జీవించొద్దా? గొప్ప లక్ష్యాలు సాధించొద్దా?



ఇటీవలే జరిగిన యుఇయస్ఐ- ఏపి ఏసియంలో మన పరిచర్య ఏ దిశగా వెళ్తుందో, మనం సాధించిన ప్రగతి ఏంటో, సాధించాల్సింది ఎంత ఉందో బేరీజు వేసుకొన్నాం. మనం పెట్టుకొన్న లక్ష్యాలు సాధించాలన్నా, విద్యార్థులపట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపాలన్నా, పరిచర్య ప్రగతి పథంలో ముందుకు సాగిపోవాలన్నా, ఆత్మీయతలో ఆయన ఆశించిన అభివృద్ధిని అందుకోవాలన్నా, పట్టుదలతో కూడిన ప్రార్థన, పటిష్టమైన ప్రణాళిక, ప్రేమతో కూడిన ప్రయాస మన జీవితంలో ప్రధాన భాగాలు కావాలి. ఇది మన సహవాస సభ్యులందరి జీవన శైలి కావాలి.

"నేను గెలవడంలో ఓడిపోవచ్చు... కానీ ప్రయత్నించడంలో గెలుస్తున్నాను... ప్రయత్నిస్తూ గెలుస్తాను... గెలిచి తీరుతాను"-అన్నాడో మేధావి. పుట్టుకతో ప్రతిభ లేకపోయినా, ప్రతిజ్ఞతో కూడిన ప్రయత్నంతో ప్రతిభను సాధించవచ్చని చరిత్ర స్పష్టం చేస్తుంది.

ప్రతి ఒక్కరికి సువార్త ప్రకటించాలని, ఆయన పిల్లలంగా, ప్రతినిధులంగా ఆయన ప్రేమను ప్రపంచ వేదికపై ప్రదర్శించాలని మన పరలోక తండ్రి స్వప్నం. సార్వభౌముని స్వప్నం సాకారమవ్వాలంటే ఆయన పిల్లలం, పరిచారకులమైన మనం కూడా స్వేదాన్ని చిందించాలి, సర్వస్వాన్ని సమర్పించాలి.

దేవుని స్వప్నాన్ని పూర్తిగా అర్థం చేసుకున్న ప్రొ. ఇనాక్ తమ కుటుంబాన్ని విద్యార్థి పరిచర్యకు అంకితం చేసి, విశ్వాస విద్యార్థుల్నే తమ పిల్లలుగా చూసుకొని మన హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారు. యేసయ్య ప్రేమతో విప్లవాత్మకంగా మారిన జోసఫ్ అభిషేకరావుగారు తన జీవితాన్ని, ప్రభువుపై ఉండే తన ప్రేమకు సూచనగా ప్రార్థించడానికి, ప్రభువు ప్రేమకు పరిచయమైన వారిపట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపడానికి సమర్పించుకొన్నారు. ఆయన స్వప్నాన్ని నెరవేర్చే ప్రక్రియలో సర్వస్వాన్ని ధార పోశారు. తమ ఆచరణీయమైన జీవితాల ద్వారా అనేకుల అంతరంగాల్లో ఇప్పటికీ జీవిస్తూ, సవాలు చేస్తూనే ఉన్నారు.

ఇలాంటి సంకల్పంతో అనేకమంది విద్యార్థులను ఈ విద్యా సంవత్సరంలో సంపాదించాలని, వ్యక్తిగత శ్రద్ధ చూపించడం ద్వారా వారి అభివృద్ధికి దోహద పడాలని, ప్రభువుకు ప్రతినిధులుగా ఉన్న మనం ఆయన స్వరూపాన్ని, స్వభావాన్ని సంతరించుకొని ఆయన స్వప్నం నెరవేర్పులో సాధనాలుగా మారాలని ప్రార్థిస్తూ....

ఆయన ప్రణాళికలో మీ....

శ్రీనివాస్
యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు



# కళాశాలలో కాంతిరేఖ

కళాశాల ప్రాంగణాలు చూడడానికి చాలా అందమైన కట్టడాలతో, గార్డెన్స్‌తో, చెట్లతో, విద్యార్థుల కేరింతలతో, సందడిగా కళకళలాడుతున్నట్లు మనకు కన్పిస్తాయి. అయితే వాస్తవంలోనికి తొంగి చూస్తే మన కన్నుల వెంట కన్నీరు రాక మానదు. కళాశాల ప్రాంగణాలు భయంకరమైన పోకడలతో సాతాను కంబంధ హస్తాలలో ఎంతగా చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నాయో ఆలోచిస్తే, మన గుండెలు తరుక్కుపోతాయి.

**మన కళాశాల ప్రాంగణాలు ఎలా ఉన్నాయంటే?**

**1. అందముగా కన్పించే 'ప్రేమ' (143)**

ఈ మధ్య కాలంలో క్లాస్ రూమ్‌లే మండపాలుగా, క్లాస్‌మేట్సే బంధువులుగా, ఈలలే ఆశీర్వాదాలుగా, చప్పట్లే మ్యూజిక్‌గా, అరుపులు, కేకల మధ్యలో ఇంటర్ కూడా పూర్తి కాని అమ్మాయి మెడలో అబ్బాయి తాళి కడుతున్న రోజులు.

నేషనల్ క్రైమ్ రిపోర్ట్ బ్యూరో రికార్డ్స్ గమనిస్తే, విద్యార్థులు చనిపోవడానికి, చంపడానికి కారణాలలో 'ప్రేమ' అనేది 3వ కారణం. 2019 రిపోర్ట్స్ ప్రకారం 384 మంది విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లో 'ప్రేమ' పేరుతో చనిపోయారు, చంపబడ్డారు. దీని ప్రకారం రోజుకు ఒకరు ప్రేమ పేరుతో చనిపోతున్నారు.

**2. అత్యాచారాలు**

నేషనల్ క్రైమ్ రిపోర్ట్ బ్యూరో 2020 రికార్డ్స్ ప్రకారం ఇండియాలో 32,300 మంది ఆడపిల్లల మీద అత్యాచారాలు జరిగాయి. ఈ లెక్కన రోజుకి 88 మంది మీద, గంటకి ముగ్గురి మీద, 20 నిమిషాలకు ఒకరు అత్యాచారానికి గురవుతున్నారు.

**3. అర్థం లేని ఆత్మహత్యలు**

టైమ్స్ ఆఫ్ ఇండియా 2020 రిపోర్ట్ ప్రకారం "ప్రతి రోజు ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకొంటున్నాడు". 2019లో 10,355 మంది ఆత్మహత్య చేసుకొన్నారు. 2021లో 13,000 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకొన్నారు. ఈ మధ్య కాలంలో ప్రతి చిన్న విషయానికి ఉరిని ఆశ్రయిస్తున్న విద్యార్థులు పెరిగిపోతున్నారు.

**4. అశ్లీలత**

అసభ్యకరమైన పదాలు, మాటలు, ద్వంద్వార్థాలతో కూడిన మాటలు, అసభ్యకరమైన వస్త్రాలు... ఇలా చెప్పుకొంటూపోతే చాలా ఉన్నాయి. అరగంట సేపు కూడా వాళ్ళతో కూర్చోలేము. నేషనల్ క్రైమ్ రిపోర్ట్ బ్యూరో రికార్డ్స్ ప్రకారం 89% మంది విద్యార్థులు అశ్లీలమైన వీడియోలు, బొమ్మలు చూడడానికే తమ మొబైల్‌ని ఎక్కువగా వాడుతున్నారు. టివోఐ సర్వే ప్రకారం 10 మందిలో 9 మంది అబ్బాయిలు, 7గురు అమ్మాయిలు అశ్లీలతకే మొగ్గు చూపుతున్నారు.

**5. అపవిత్రత (వివాహానికి ముందు)**

టివోఐ సర్వే ప్రకారం 15-17 సం॥రాల మధ్య వయస్సువాళ్ళు 53% అబ్బాయిలు, 74% మంది అమ్మాయిలు పెళ్ళికి ముందే తమ కన్యత్వాన్ని కోల్పోతున్నారు.

మన భారతదేశ కళాశాల ప్రాంగణాలలోని అవినీతికి, అపవిత్రతకు, అతి విగ్రహారాధనకు, అత్యాచారాలకు, అన్యాయాలకు, అశ్లీలతకు, అక్రమాలకు ఎదురు నిలబడి పోరాడే వ్యక్తిగా ఇయు విద్యార్థి ఉండాలి.

### 6. అబార్షన్

నెక్ట్స్ ఐఏయస్ 2022 సర్వే ప్రకారం సంవత్సరానికి 1 కోటి 56 లక్షల మంది, రోజుకి 42,739 మంది, గంటకి 1780 మంది, నిమిషానికి 29 మంది పెళ్ళి కాని యువతులు భారతదేశంలో అబార్షన్స్ చేయించుకొంటున్నారు.

సహజంగా కళాశాల ప్రాంగణాలలో జరుగుతున్న ఆకృత్యాలను, అన్యాయాలను, అపవిత్రతను, అశ్లీలతను చూడగానే మనం నేటి విద్యార్థులను, సమాజాన్ని, దాని పోకడలను తప్పు పడతాము, అవసరమైతే వేలెత్తి చూపిస్తాము.

అయితే జాన్ స్టాట్ గారి మాటలను గమనిస్తే... "ప్రశ్నించాల్సింది పాడైపోయిన సమాజాన్ని కాదు, ప్రశ్నించాల్సింది వెలుగుని మరియు ఉప్పుని". ఆయన మాటలలో.. "సమాజానికి ఏమైంది, కళాశాల ప్రాంగణాలకు ఏమైంది అని అడగకండి, వెలుగుకి మరియు ఉప్పుకి ఏమైందని" అడగండి.

## ఇయు విద్యార్థికి ఎదురయ్యే సవాళ్ళు

### 1. అందరికి తెలియని పాపం (రహస్య పాపం)

సహజంగా నలుగురిలో ఉన్నప్పుడు మనం బాగుంటాము, కాని నాలుగు గోడల మధ్యలోకి ఎవరైనా వెళ్తేనే అసలు స్వరూపం బయటపడుతుంది. అందరూ చూస్తున్నప్పుడు బాగుంటాము, ఎవరూ చూడనప్పుడు అసలు విషయం బయట పడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే "ఒంటరిగా ఉన్నప్పుడు జీవించే జీవితమే... జీవితము". స్మార్ట్‌ఫోన్ పుణ్యమా అని రహస్య పాపజీవితం పెచ్చురిల్లుతుంది. 1.5 జిబి డేటాతో అనుకోకుండా "పాపం"లో పడే అవకాశాలు మెండుగా ఉంటున్నాయి. అవకాశాలు రాక పాపం చెయ్యడం లేదు కాని అవకాశాలు వస్తే వదిలిపెట్టే ప్రసక్తి లేనివారమేమో ఆలోచించుకుందాము.

ఉదా: దావీదు – బత్షెబాతో పాపం చేయడం

ఒకవేళ ఇప్పటికే రహస్య పాపంలో ఉంటే దేవుని దగ్గర ఒప్పుకొని విడిచి పెట్టాలి (కీర్తన 19:12,13). "ఒంటరిగా ఉన్నప్పుడు, ఎవ్వరూ చూడనప్పుడు, ఎవ్వరూ లెక్క అడగనప్పుడు, అవకాశాలు ఉన్నప్పుడు పాపం విషయంలో జాగ్రత్తగా ఉండాలి".

### 2. అబ్బాయిలు/అమ్మాయిలు

కళాశాల ప్రాంగణాలలో జంటలు, జంటలుగా కన్పించే స్టూడెంట్స్‌ని చూడగానే విశ్వాస విద్యార్థులకు కూడా 'తప్పు' కాదులే, మనక్కూడా ఒకరుంటే బాగుంటుంది అనే ఆలోచనలు వస్తాయి. అయితే జాగ్రత్త. ప్రసంగి 7:26 ప్రకారం అమ్మాయిలకు, అబ్బాయిలు బంధకము లాంటివారు, అబ్బాయిలకు అమ్మాయిలు కూడా బంధకము లాంటివారే అనే సంగతి గుర్తుంచుకోవాలి.

1 పేతురు 1:16లో సమస్త ప్రవర్తనలో పరిశుద్ధులై ఉండాలి. హెబ్రీ 13:4 ప్రకారం పాన్పు నిష్కల్మషమైనదిగాను ఉండాలి... అందుకే 3:3:3 (ముగ్గురు మనుష్యులు, 3 అడుగుల దూరం, 3 మాటలు/ 3 నిమిషాలు) అనే ఆధ్యాత్మిక సూత్రానికి కాలం చెల్లినట్లు చూడకుండా, పాపంలో పడకుండా కాపాడే సూత్రంగా చూడాలి. "నా ఒంటి మీద నాకు కాబోయే భార్య/భర్త చేతులు తప్ప పర స్త్రీ/ పర పురుషుని చేతులు పడనివ్వను" అనే నిర్ణయం మనది కావాలి. రహస్యంగా అక్రమ సంబంధాలైమైనా ఉంటే ప్రభువు దగ్గర ఒప్పుకొని విడిచిపెడదాం.

### 3. అహంకార స్వభావం/ ఆత్మన్యూనత భావం

చాలామంది విశ్వాస విద్యార్థుల వ్యక్తిత్వము (పర్సనాలిటి) దగ్గర స్ట్రగుల్ అవ్వడం మనం చూస్తున్నాము. ప్రాముఖ్యంగా రెండు విషయాలు

1. ఎక్కువగా ఎంచుకోవడం – అహంకారం
2. తక్కువగా ఎంచుకోవడం – ఆత్మన్యూనత

ఇతరులతో పోల్చుకొని చాలా కుమిలి పోతారు. ఎదుటివారి తెలివి, డబ్బు, అందం, చాకచక్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్... వారిలో ఉండి తనలో తగినంత లేవు అని కృంగి పోవడం – తనను తాను తక్కువగా చూసుకోవడం "నేనా?" అని చతికిలబడి పోతారు. ఇంకొక రకం తమను తాము ఎక్కువగా చూసుకొని తమ తలాంతులు, చదువు, తెలివి, చాకచక్యం... ఇలా ఇక ఎవ్వరి మాటా వినరు, ఎవ్వరినీ పట్టించుకోరు... 'నేను"... అంటూ చెలరేగి పోతుంటారు.

దాని 4:30 ప్రకారం – ఎక్కువగా ఎంచుకోవడం, న్యాయా 6:15 ప్రకారం – తక్కువగా ఎంచుకోవడం. "దేవుడు మనల్ని చూసినట్లు మనల్ని మనం చూసుకోవడం నేర్చుకొంటూ అహంకారం నుండి, ఆత్మన్యూనత నుండి బయటపడదాం.

### 4. అపవాది తంత్రములు

ఈ మధ్య కాలంలో కళాశాల ప్రాంగణాలలో విశ్వాస విద్యార్థులు తప్పుడు సిద్ధాంతాలు, తప్పుడు బోధలు, తప్పుడు పద్ధతులు, తప్పుడు సంబంధాలు, తప్పుడు ఆధ్యాత్మిక స్థితిని ప్రోత్సహించే వాటివైపు మొగ్గు చూపుతున్నారు. 1 పేతురు 5:8 ప్రకారం అపవాది... గర్జించు సింహము వలె తిరుగుచున్నాడు.

దేవుని గూర్చి, మన క్యారెక్టర్ మీద దాడి చేస్తున్నాడు. పరిశుద్ధతను పట్టించుకోని ప్రసంగాలు, పాటలు, పనులు వచ్చేశాయి. మ్యూజికల్ నైట్‌లు, పార్టీ స్టయిల్ సంఘాలు వచ్చేశాయి. ఊగిపోవడం ఉన్నతమైన స్థితి అని, ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ విశ్వాస విద్యార్థులను ఊడ్చేస్తున్నారు. కార్పొరేట్ సంఘాలు, కార్పొరేట్ పాస్టర్స్, కార్పొరేట్ ఆరాధనలు... విశ్వాస విద్యార్థులను కాల్చేస్తున్నవి. జాగ్రత్త... ఏది ఉత్తమమో, అనుకూలమో, దేవుని చిత్తమో కనుగొని అందులో కొనసాగాలి.

### 5. అసాధారణముగా జీవించడం

ఈ మధ్య కాలములో జరిగిన ఏసియం–2023 లెక్కల ప్రకారం స్టూడెంట్స్ దేవునికి ఇచ్చింది 4% అని వచ్చింది. అంటే దానర్థం చాలామందికి దేవునికి డబ్బులు ఇచ్చే మనసు లేదు అని. విద్యార్థుల దగ్గర డబ్బులు లేకుండా ఇవ్వలేక పోతున్నారు అంటే పర్వాలేదు కాని ఉంచుకొని ఇవ్వడం లేదంటే ఆలోచించాలి.

విద్యార్థులు వాడే స్మార్ట్ ఫోన్, నెల నెల రీఛార్జ్‌లు, తినే బిర్యానీలు, తాగే డ్రింక్స్, వాడే చెప్పులు, వేసుకొనే టీ షర్ట్స్... చేసుకునే పార్టీలలో నుండి డబ్బులు ఇవ్వడం కష్టమేమీ కాదు.

ఎంత మితంగా, సాధారణంగా జీవించాలనే సంగతులు దేవుని వాక్యం నుండి, వ్యక్తుల నుండి నేర్చుకోవడం మంచిది. దేవుడు మనల్ని ఆర్థికంగా దీవిస్తే, మనం జీవించే స్థాయిని పెంచకూడదు, దేవునికి ఇచ్చే స్థాయిని పెంచాలి.

### 6. అవినీతికి వ్యతిరేకముగా నిలబడడం

కళాశాల ప్రాంగణాలలో

**1. అన్యాయపు చదువులు ఉన్నవి:** ఏదైనా కోర్స్ ఫుల్ టైమ్ కోర్స్‌గా జాయిన్ అయి, డబ్బులు కట్టి అటెండెన్స్ మ్యానేజ్ చేసి, పరీక్షలు మాత్రమే రాసి, ఉత్తీర్ణులై సర్టిఫికెట్స్ తెచ్చుకోవడం ఎంత మోసము. చాలా ఎక్కువగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ విషయంలో మనం మోసం చేస్తున్నాము. ఇలా చేయడం వలన తప్పు చేస్తున్న కళాశాలను ప్రోత్సహిస్తున్నాము. మనం కూడా తప్పు చేస్తున్నాము. ఒక్కసారి మనసుపెట్టి ఆలోచన చేయండి.

**2. అన్యాయపు మార్కులు:** మన రికార్డ్స్ వేరేవారు రాయడం, మన అసైన్‌మెంట్స్ వేరేవారు రాయడం, మన నోట్స్ వేరేవారు రాయడం, మనం గీయాల్సిన బొమ్మలు వేరేవారు గీయడం, మనం చేయాల్సిన పని వేరేవారు చేయడం... సిగ్గుచేటు. ప్రభువు పాదాల దగ్గర పడి క్షమాపణ కోరదాం.

### ముగింపు

యెషయా 43:12 ప్రకారం "నేను దేవుడను... మీరే నాకు సాక్షులు"... ఇదే యెహోవా వాక్కు. కళాశాల ప్రాంగణాలలో మనమే సాక్షులము. "కన్పించని దేవునిని మన జీవితం ద్వారా లోకానికి చూపించడం మన ప్రధాన కర్తవ్యము". మత్తయి 5:13-16- మీరు లోకమునకు వెలుగై ఉన్నారు. మీరు లోకమునకు ఉప్పై యున్నారు.

కారు చీకటిలో ఉన్న కళాశాల ప్రాంగణాలకు కాంతిరేఖలా వెలుగును చూపించేవారు కావాలి. అందుకే కళాశాలలకు "దీపాలు కావాలి – దీపాలు వెలిగించేవారు కావాలి". మన భారతదేశ కళాశాల ప్రాంగణాలలోని అవినీతికి, అపవిత్రతకు, అతి విగ్రహారాధనకు, అత్యాచారాలకు, అన్యాయాలకు, అశ్లీలతకు, అక్రమాలకు ఎదురు నిలబడి పోరాడే వ్యక్తిగా ఇయు విద్యార్థి ఉండాలి. అందుకే దేవుడు యుఇయస్ఐ అనే ఉద్యమాన్ని లేవనెత్తాడు. ఇయు విద్యార్థి తాను చదువుచున్న కళాశాలలో కాంతిరేఖలా ఉండాలన్నదే దేవుని ఆశ. ఇంతటి బాధ్యత ప్రతి ఒక్క విశ్వాస విద్యార్థి మీద దేవుడు ఉంచాడు అనే సంగతి అర్థం చేసుకోవాలి.

**– యం. గాలెయ్య,** భీమవరం



ప్రత్యేకం

# నా కళాశాలే నా సేవా పొలం

నాకు తెలిసిన ఒక రైతు ఉన్నాడు. అతను పొలంలో భూమిని దుక్కి చేసి, దున్ని, నాట్లు వేసి, ఎరువేసి, కలుపు తీసి చేతికి పంట వచ్చేంతవరకు తన సమయం అంతా పొలంలోనే ఎక్కువ గడిపేవాడు. చివరకు పంటను చూసి ఎంతో సంతోషించేవాడు. అది రైతు యొక్క పని, బాధ్యత. విశ్వాస విద్యార్థిగా నీ కళాశాలలో నువ్వు ఒక రైతులా ఉండాలి. నువ్వు కళాశాలలో జాయిన్ అయినది మొదలుకొని నీ కోర్స్ ముగించే వరకు నీ కళాశాలకు నువ్వే ఒక రైతువి. నీ కళాశాలే నీ సేవా పొలం. నీ కళాశాలను ప్రేయర్ వాక్స్‌తో దుక్కి చేస్తూ, కన్నీటి ప్రార్థనతో తడపాలి. వాక్యమనే విత్తనాలు చల్లాలి. విద్యార్థుల్లో కలుపు అనే చెడును తీసివేయాలి, ఎరువులు అనే సహవాసంతో వారిని పెంచాలి. అయితే ఆ రైతు ఆ పంట చేతికి వచ్చేవరకు పగలనకా రాత్రనకా ఎంతో కష్టపడతాడు. అలాగే నువ్వు కూడా నీ కళాశాలలోని విద్యార్థుల రక్షణ కోసం ఎంతో కష్టపడాలి.

### నీ కళాశాల అనే పొలాన్ని పట్టించుకోక పోవడానికి గల కారణాలు

- నీ కళాశాలే నీవు పనిచేయాల్సిన ప్రదేశం అని గుర్తించక పోవడం
- నీ కళాశాలలో నశించిపోతున్న విద్యార్థుల రక్షణ గూర్చిన భారం నీకు లేకపోవడం
- నీ వ్యక్తిగత జీవితంలో పరిశుద్ధత లేకపోవడం
- నీ సాక్ష్య జీవితాన్ని సరిగా చూపించలేక పోవడం
- నీ చదువులో రాణించలేక పోవడం
- నీ కళాశాలకు క్రమంగా వెళ్ళక పోవడం
- పరీక్షలలో కాపీలు కొట్టడం, సమయపాలన లేకపోవడం, మంచి ప్రవర్తన లేకపోవడం

### నువ్వు నీ కళాశాలలో ఎలా పని చేయాలి?

#### వ్యక్తిగత ప్రార్థన ద్వారా

నాకు తెలిసిన ఒక సహోదరుడు తన కళాశాల సమయం కంటే ముందుగానే వెళ్ళి క్లాస్ రూమ్‌లో బెంచ్ మీద తలవంచి ఒక్కొక్కరి పేరు పెట్టి వారి రక్షణ కోసం ప్రార్థించేవాడు. నీ క్లాస్‌లో ఎంతమంది ఉన్నారో వారి పేర్లేంటో నీకు తెలియాలి. నీ కళాశాలలో ఎన్ని డిపార్ట్‌మెంట్స్ ఉన్నాయో, ఎంత మంది స్టూడెంట్స్ ఉన్నారో, వారు ఎలాంటి పరిస్థితులు గుండా వెళుతున్నారో సమాచారం తెలుసుకొని నెహెమ్యా వలె ప్రార్థించాలి. ప్రార్థనతో నీ కళాశాల అనే పొలాన్ని పండించాలి. “వేలమంది యవ్వనస్తులు మరణ మార్గం గుండా పోవడం నేను గమనించినప్పుడు, వాళ్ళను రక్షించమని కన్నీటితో యేసయ్య పాదాలపై పడి ఏడ్వాలనిపిస్తుంది” అని డియల్ మూడి అంటాడు.

#### వ్యక్తిగత సాక్ష్యం ద్వారా

బైబిల్లో కనిపించే వాక్యం కంటే ముందు నీలో ఉన్న క్రీస్తును వారికి చూపించాలి. నీ ప్రవర్తన, నీ మాటలు, నీ చూపులు, నీ ఆలోచనలు మంచిగా ఉండాలి. నీలో ఉన్న క్రీస్తును చూపించినప్పుడు బైబిల్‌లో ఉన్న క్రీస్తుని చూస్తారు.

నీ స్టడీస్ మిగిలిన వారికంటే భిన్నంగా ఉండాలి. అరకొరా చదివి బోర్డర్లో పాస్ అయ్యి ఎవ్వరిని ఉద్ధరించలేవు. గనుక నీ కళాశాల అనే పొలాన్ని

దున్నడానికి, కష్టపడడానికి సిద్ధంగా ఉండు. క్రమంగా కళాశాలకు వెళుతూ, ఎప్పటి లెసన్స్ అప్పుడే కంప్లీట్ చేస్తూ, ఇంపార్టెంట్ ప్రశ్నలు అనే ఆలోచన తీసేసి సిలబస్ పేపర్ దగ్గర పెట్టుకొని అన్ని చాప్టర్స్ కవర్ చేసి పరీక్షలు రాస్తే విజయం నీదే. తద్వారా అనేకమంది నీ వైపు ఆకర్షితులవుతారు. అప్పుడు నువ్వు యేసును వారికి పరిచయం చేయడం సులువు అవుతుంది.

ఒక విద్యార్థి మూడు నెలలు కంప్యూటర్ కోర్స్ నేర్చుకోవడానికి జాయిన్ అయ్యాడు. తను మూడు నెలలు క్రమంగా వెళుతూ సమయపాలన పాటిస్తూ అందరినీ చెల్లీ, తమ్ముడూ అని సంబోధిస్తూ తన కోర్సును ముగించాడు.

అయితే చివరి రోజు అందరి గురించి షేర్ చేసుకోమన్నప్పుడు వారందరూ ఆ వ్యక్తి గురించి ఇలా షేర్ చేశారు. అన్నయ్యకు జీసస్ అంటే చాలా ఇష్టం. అందర్నీ చెల్లీ, తమ్ముడూ అని చక్కగా సంబోధిస్తాడు. అందరిని గౌరవిస్తాడు అని చెప్పారు. ఆ వ్యక్తిలో వారు క్రీస్తుని చూశారు. నీలో కూడా తోటివారు క్రీస్తును చూడాలి.

## వ్యక్తిగత సౌవార్తీకరణ ద్వారా

నీ క్లాస్‌లోని విద్యార్థులకు వ్యక్తిగతంగా సువార్తను చెప్పాలి. నశించిపోయే ఆత్మలపట్ల "నిజమైనప్రేమ" ఉంటే సువార్త శక్తివంతమైనదిగా ఉంటుంది. ఆ ప్రేమనుండే ఆత్మలభారం, వేదనతో కూడిన ప్రార్థన, సమయోచితమైన ప్రయత్నం ఉంటాయి. తోటివారు సరైన విధంగా స్పందించక పోయినా ప్రేమించడం మానకూడదు. నీ పద్ధతిలో, మాటలో, ప్రవర్తనలో యధార్థత ఉండాలి. నీవు చాలా సహనంతో ఉండాలి. మొదటిగా ప్రేమ చూపాలి, స్నేహం ఏర్పడాలి. సమయం, సందర్భం వచ్చినప్పుడు సువార్తను లేదా సాక్ష్యాన్ని పంచుకో. ప్రభువు లేకపోతే వారు నిత్య నాశనానికి వెళ్తాడనే భావనతో ప్రార్థించి, ప్రయత్నించాలి. వ్యక్తిగతంగా మాట్లాడడానికి ముందు, మధ్యమధ్యలో, చివర నెహెమ్యా వలె ప్రార్థించు, సమయోచితమైన మాటలిమ్మని దేవుని అడుగు.

## సమస్యలకు పరిష్కారం యేసే అని చెప్పడం ద్వారా

ఈ రోజు అనేకమంది విద్యార్థులు క్షణికమైన వాటి కోసం ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. కళాశాలల్లో ర్యాగింగ్, ప్రేమలు, అమ్మాయిలను వేధించడం, కుల, మత తత్వం, నాసికరం చదువులు, నాసిరకం సౌకర్యాలు ...ఇలా ఎన్నో ఉంటున్నాయి. ఈ సమస్యలన్నిటికీ మూలం మానవుని పాపమని, పాపానికి పరిష్కారం యేసుక్రీస్తే అని చెప్పాలి. అందుకే ఆయన ఈ లోకంలో జన్మించి, మానవాళి రక్షణకై మరణించి, అందరిని రెండవ మరణం నుండి విడిపించడానికి తిరిగి లేచాడని ప్రకటించాలి.

## ఇది మాత్రమే పరిచర్య అనుకోకు

విద్యార్థులను క్యాంప్స్‌కి, రిట్రీట్స్‌కి, బైబిల్ స్టడీస్‌కి తీసుకొని వెళ్ళడం, ప్రోగ్రామ్స్‌లో చురుకుగా ఇన్వాల్వ్ అవ్వడం, డైరెక్టర్‌గా చేయడం, పాటలు పాడడం, ఫిజికల్ అరేంజ్‌మెంట్స్ చేయడం... ఇవి కూడా పరిచర్యే కానీ దీనికంటే ముందు నీ వ్యక్తిగత పరిశుద్ధత, దేవునితో నీ వ్యక్తిగత జీవితం, నీ మౌనధ్యాన సమయం, నీ ప్రార్థన సమయం, విశ్వాసులతో నీ సహవాసము ఎలా ఉందో చూసుకో. ఇవి బాగుంటే పైన చెప్పినవన్నీ ఫలభరితంగా ఉంటాయి. కొన్నిసార్లు పంట విషయంలో శ్రద్ధ తీసుకోకపోతే ఫలభరితమైన పంట చేతికందదు. నువ్వు చదివే కళాశాలలో ఒక వ్యక్తినైనా రక్షించకపోతే పంటను పొందుకోలేనట్టే. కుటుంబానికి బరువు కాకూడదని ఒకరు, తప్పానని ఇంకొకరు ఇలా ఎంతో మంది విద్యార్థులు సాతాను చేతిలో చిక్కుకొని వారి జీవితాలను చాలిస్తున్నారు.

నీ కళాశాల అనే పొలం కొరకు కష్టపడతావా? ప్రార్థనతో వాక్యంతో పొలాన్ని సాగు చేసి దాన్ని పండిస్తావా? నీ కళాశాలకు ఒక కూలి వానిగా ఒక కావలి వానిగా నీవు ఉంటావా? అయితే ప్రియ యేసు నాథా పనిచేయ నేర్పు అని ఆయన పాదాల చెంత కూర్చొని ప్రార్థిస్తావా? అప్పుడే జులై నెల వచ్చేసింది. మన కళాశాల అనే పొలాన్ని సాగుచేయాల్సిన సమయం దగ్గర పడింది. కష్టపడదాం, పనిచేద్దాం, ఫలితం పొందుకొందాం.

**– కె. ఆనంద్ కుమార్,** విద్యార్థి (బియస్సీ యంయల్‌టి), రాజమండ్రి

**అప్పుడే జులై నెల వచ్చేసింది. మన కళాశాల అనే పొలాన్ని సాగుచేయాల్సిన సమయం దగ్గర పడింది. కష్టపడదాం, పనిచేద్దాం, ఫలితం పొందుకొందాం.**

# ఏది నీ ఎంపిక?

## కీర్తన 1



### పరిచయం

నేటి ప్రపంచంలో అనేక ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. మనం చేసే ఎంపికపైనే దాని పర్యవసానాలు, ఫలితాలు ఆధారపడి ఉంటాయి. ఈ కీర్తనలో కూడా విభిన్న జీవన శైలులు, విభిన్న వ్యక్తులు, విభిన్న మార్గాలు, విభిన్న గమ్యాలు గమనించగలం. కాలవ పక్కన ఎదిగే మొక్క వర్షం కోసం ఎదురు చూడదు. అనుదినం అందుబాటులోనున్న నీటిని పీల్చుకొని సంవత్సరమంతా పచ్చగా, ఫలవంతంగా ఉంటుంది. అది చాలామందికి పోషణ నిచ్చి, నీడనిస్తుంది. ఫలవంతమైన జీవితాన్ని గమ్యంగా కోరే వ్యక్తి వేటిని ఎంచుకోవాలో, వేటిని ఎంచుకో కూడదో ఈ కీర్తన స్పష్టం చేసింది. వాటి ఫలితం ఒక పురి కొల్పు, మరొక హెచ్చరిక. బాహ్య పరిస్థితులు ఎలా ఉన్నా దేవుని నుంచి పోషణ తీసుకొని, జీవిస్తూ ఎదుగుతారు. అలాంటి జీవితాన్ని కోరుకోని వ్యక్తి అంతిమ గమ్యం ఎలా ముగుస్తుందో వివరించింది. ఈ వాక్య భాగంలో వాటి ప్రస్తావన మనకొక పురి కొల్పు, మరొక హెచ్చరిక. మన ఎంపిక దేనికి?

### ప్రశ్నలు

1. ఎటువంటి నిర్ణయాలు చేయడం మనకు సులువు? ఏవి కష్టమైనవి ?
2. మొదటి వచనంలో చెప్పిన విభిన్న వ్యక్తుల లక్షణాలను వివరించండి?
3. వీరితో స్నేహం, సహవాసం ఒక విశ్వాసిపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతుంది?
4. ఈ కీర్తనలో నీవు గమనించే వ్యక్తుల లక్షణాలు ఏంటి ? 2,4,6 వ
5. విశ్వాసి దేవుని వాక్యం పట్ల చూపే వైఖరి, ఆచరణ ఎటువంటి ఆశీర్వాదాలను ఇస్తుంది? 2,3 వ
6. ఇది ఇతరులకు ఆశీర్వాదకరంగా ఉండడానికి ఎలా సహాయపడుతుంది? (చిత్రాన్ని దృష్టిలో పెట్టుకో) 2,3 వ
7. ఇటీవల కాలంలో నీ వాక్య ధ్యానం అనుభవాలను గమనానికి తెచ్చుకో. దాని లేమి వలన నీవు కోల్పోయినది ఏంటి?
8. రెండు రకాల చిత్రాలు, రెండు రకాల వ్యక్తులు, రెండు రకాల మార్గాలు ఏంటి? (3,4 వ). అవి ఎటువంటి గమ్యానికి దారితీస్తాయి? 3-6 వ
9. రెండు చెట్ల చిత్రాలను ఒక పేపర్ పై గీయండి. ఒక చిత్రం ప్రస్తుతం నీ జీవిత పరిస్థితిని ప్రతిబింబించాలి. మరో చిత్రం భవిష్యత్‌లో ఎలా ఉండాలని నీవు ఇష్టపడుతున్నావో తెలియజేయాలి. రెండింటి మధ్య నీ ఆధ్యాత్మిక పోషణ, ఎదుగుదలకు అవసరమయ్యే కార్యాచరణ ప్రణాళిక రాసుకో.
10. మనం చేసే జ్ఞానయుక్తమైన నిర్ణయాలలో ఈ కీర్తన మనలను ఏ విధంగా పురికొల్పి, హెచ్చరించి, సవాలు చేస్తుంది?

**- బి. మంజుల లాజరస్,** విజయవాడ
(యుఇయస్ఐ నేషనల్ రిటైర్డ్ స్టాఫ్)

**గమనిక:** ఈ సంచిక నుంచి ప్రతి నెల ఒక బైబిల్ స్టడీని ప్రచురిస్తాము. గనుక ప్రతిఒక్కరు వ్యక్తిగతంగా ఈ బైబిల్‌స్టడీస్ చేయాలని, ఆత్మీయ ఆశీర్వాదాలు పొందుకోవాలని ఆశిస్తున్నాము. **- మీ ఎడిటోరియల్ బోర్డ్**



# విజయానికి ఏడు మెట్లు

మనము గెలవడాన్ని ప్రేమిస్తాము. అయితే మనం గెలిచేలా మన జీవితాన్ని మలచుకోవడం నేర్చుకోవాలి. ఆత్మీయ జీవితంలో, భౌతిక విషయాల్లో కూడా మనం విజయం సాధించడానికి ప్రయత్నించాలి. జీవితములో విజేతగా ఉండడం ప్రాముఖ్యమైన అంశము. మన అంతిమ లక్ష్యం యేసుక్రీస్తు సారూప్యములోనికి మార్చబడడమే కాబట్టి మనము క్రమశిక్షణతో కూడిన జీవితము జీవించడము ద్వారా మాత్రమే మనము విజయం సాధించగలం. అశాశ్వతమైన లోకం కోసం అనేకమంది తమ యొక్క జీవితాలను ఎంతో క్రమశిక్షణతో జీవిస్తూ ఉంటే నిత్యత్వం కోసం జీవించే మనం ఇంకెంతగా ప్రయాసపడాలి. ఈ వ్యాసంలో ఆత్మీయంగా విజయం సాధించాలంటే ఉండాల్సిన ఏడు మెట్లు గూర్చి చూద్దాం.

## 1. వాక్యధ్యానం

మనము క్రైస్తవ జీవితమనే మారథాన్‌లో జయించాలంటే మనకు సమతుల్యమైన ఆహారం కావాలి, అదే దేవుని వాక్యము. కార్బోహైడ్రేట్స్ ఎలాగైతే శరీరానికి శక్తిని అందిస్తాయో, దేవుని వాక్యము క్రైస్తవ జీవితానికి కావలసిన అధిక శక్తిని అందిస్తుంది. గనుక దేవుని వాక్యాన్ని చదవడానికి మనము ప్రతిరోజూ కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. దాని కోసం ఆశపడాలి (1 పేతురు 2:2).

### మనము నిలకడగా దేవుని వాక్యము చేత పోషించబడడానికి ఐదు వ్యూహాలు

1. **లేఖనాల్లో ప్రావీణ్యత సాధించు:** దేవుని సత్యాన్ని గ్రహించడానికి దేవుని యొక్క వాక్యాన్ని చదవాలి, అధ్యయనము చేయాలి (2 తిమోతి 2:15), ప్రావీణ్యతను సాధించాలి. దీనికోసం అధిక సమయాన్ని కేటాయించాలి.
2. **లేఖనాల గొప్పతనాన్ని, అధికారాన్ని గుర్తించు:** దేవుని వాక్యమే దేవుని స్వరం. బైబిల్ మాట్లాడితే దేవుడు మాట్లాడినట్లు. గనుక వాక్యాన్ని తక్కువగా ఎంచకుండా, దానికి నీ జీవితంలో ప్రాముఖ్యమైన స్థానాన్ని ఇస్తూ ఆయన వాక్యము మనలో సమృద్ధిగా నివసింపనియ్యాలి (కొలొస్సీ 3:16).
3. **లేఖనాల్ని కంఠస్థం చేయాలి:** కంఠస్థం చేయడం ద్వారా దేవుని వాక్యాన్ని మన హృదయములో ప్రతిరోజూ భద్రం చేసుకోవాలి. నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొన్నాను అని కీర్తనాకారుడు అంటాడు (కీర్తన 119:11). మన ప్రభువైన యేసుక్రీస్తు కూడా అరణ్యంలో అపవాది చేత మూడు సార్లు శోధింపబడినప్పుడు హృదయంలో భద్రం చేసుకొన్న దేవుని వాక్యం చేత అపవాదిని ఎదిరించాడు (మత్తయి 4:4,7,10).
4. **లేఖనాల్ని ధ్యానించాలి:** ధ్యానించడం అంటే మనము తీసుకొన్న వాక్యమనే ఆహారాన్ని జీర్ణము చేసుకోవడం. దానిని మనము అర్థము చేసుకొనేవరకు దేవుని వాక్యాన్ని గూర్చి ఆలోచిస్తూ ఉండాలి, ధ్యానిస్తూ ఉండాలి. నీ సేవకుడు నీ కట్టడలను ధ్యానించుచుండును, నీ ఆశ్చర్య కార్యములను నేను ధ్యానించెదను (కీర్తన 119:23,27). ధ్యానించిన వాక్యం మన నడతలోకి రావాలి.

నేషనల్ స్కిల్స్ రిపోర్ట్ ప్రకారం కేవలం 50% యువత మాత్రమే ఉద్యోగం చేయగలిగే సామర్థ్యం కలిగి ఉన్నారు. అనేకమంది నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇండియా ప్రధాన సమస్య నిరుద్యోగం కాదు, ఉద్యోగం చేసే సామర్థ్యం లేకపోవడమే. ఈ 21 వ శతాబ్దము నైపుణ్యాల యుగముగా మనము చెప్పవచ్చు. కాబట్టి విశ్వాస విద్యార్థులు కూడా ఈ విద్యా సం॥ ప్రారంభం నుండే అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడం మీద దృష్టి సారించినట్లయితే ఉద్యోగము సాధించడం కష్టమేమీ కాదు.

5. **వాక్యాన్ని ప్రకటించాలి:** మనము దేవుని వాక్యాన్ని ఇతరులకు చెప్పే కొలది అది మనలో ఒక భాగము అవుతుంది, అంతగా దాని గూర్చి స్పష్టత పెరుగుతుంది.

## 2. దేవుని చిత్తాన్ని జరిగించడం

దేవుని చిత్తాన్ని తెలుసుకోవడం గొప్ప జ్ఞానము. ఆయన చిత్తాన్ని జరిగించడం గొప్ప విజయం. హృదయానికి శాంతిని, మనసుకు ఆనందాన్ని, జీవితానికి సౌందర్యాన్ని తీసుకొనివచ్చే ఒకే ఒక మార్గం ఉంది, అదే దేవుని చిత్తాన్ని అంగీకరించి, చేయడం. మన జీవితాల్లో దేవుని చిత్తాన్ని మన చిత్తము వైపు వంచడం కాదు గానీ మన యొక్క చిత్తాన్ని దేవుని చిత్తము వైపు మలచుకోవాలి. ఆయన చిత్తానికి లోబడితే మన జీవితము ఏ దిశలో వెళుతుందో తెలియక పోయినా ఆయనకు లోబడడం నేర్చుకోవాలి. ఎందుకంటే మనము ఉండదగిన సురక్షితమైన ప్రదేశము దేవుని చిత్తం. 'దేవుని చిత్తము చేసి దేవునిని అత్యున్నతముగా సంతోషపెట్టిన వ్యక్తి' అని మన యొక్క సమాధి మీద రాస్తే ఎంత గొప్ప విజయమో కదా. యేసుక్రీస్తు లాగా మనము కూడా తండ్రి యొక్క చిత్తము నెరవేర్చడం, ఆయన పనిని తుదముట్టించడం నాకు ఆహారమై ఉన్నది అని చెప్పగలిగితే దేవుని సంతోషపెడతాం. దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికి నువ్వు సమస్తాన్ని, ఇంకా ప్రాణాన్ని కోల్పోయినా గానీ నువ్వే గొప్ప విజేతవే.

## దేవుని చిత్తాన్ని చేయడానికి ఆటంకాలు

1. స్వచిత్తము, 2. మన మీద ఇతరుల యొక్క ప్రభావము, 3. దేవుని చిత్తం పట్ల అజ్ఞానం, దేవుని చిత్తము కొరకు సహనంతో ఎదురు చూడలేక పోవడము, 4. పాపం మన జీవితంలో ఉండడం. పాపము దేవుని స్వరాన్ని వినకుండా మన లను చెవిటివానిగా చేస్తుంది,

## 3. నైపుణ్యాలు పెంపొందించుకోవడం

ఒక విశ్వాసి జీవితంలో శీలం, నైపుణ్యం ఎంతో కీలకమైనవి. లౌకిక ప్రపంచంలో నైపుణ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తే, క్రైస్తవ పరిచర్య శీలానికి అధిక ప్రాధాన్యత ఇస్తుంది. అయితే క్రైస్తవులంగా మనం శీలంతోపాటు నైపుణ్యాలు కూడా పెంచుకోవాలి. మన పరిచర్య ఎక్కువగా వ్యాప్తి చెందక పోవడానికి అనేక కారణాలు ఉన్నప్పటికి ఒక ప్రధానమైన కారణము బోధకుల్లో, బైబిల్ స్టడీ తీసుకొనేవారిలో నైపుణ్య లేమి కనిపిస్తూ ఉంటుంది. మారుతున్న సమకాలీన పరి స్థితులకు, విద్యార్థి లోకానికి సంస్కృతికి తగినట్లు కాల క్రమేణా నైపుణ్యాలు తగినంతగా అభివృద్ధి చేసుకోక పోవడమే దీనికి కారణం.

డాక్ట్రిన్స్ తీసుకొనేవారు ఎక్కువగా బైబిల్‌తోపాటు సిస్టమాటిక్ థియాలజీ పుస్తకాలు చదవాలి. అడ్మినిస్ట్రేషన్‌లో ఉన్నవారు అడ్మినిస్ట్రేటివ్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. బైబిల్‌స్టడీస్ తీసుకొనేవారు క్రియేటివ్ బైబిల్ స్టడీ నైపుణ్యాలు పెంచుకోవాలి. కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి. ఉద్యోగ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవాలి. దేవుడు తన రాజ్యాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి ప్రజలకు ఆధ్యాత్మిక బహుమతులు లేదా ఆధ్యాత్మిక నైపుణ్యాన్ని ఇస్తాడు. వాటిని మనం వృద్ధి చేసుకోవాలి. నేషనల్ స్కిల్స్ రిపోర్ట్ ప్రకారం కేవలం 50% యువత మాత్రమే ఉద్యోగం చేయగలిగే సామర్థ్యం కలిగియున్నారు. అనేకమంది నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇండియాలోని ప్రధాన సమస్య నిరుద్యోగం కాదు, ఉద్యోగం చేసే సామర్థ్యం లేకపోవడమే. ఈ 21 వ శతాబ్దాన్ని నైపుణ్యాల యుగముగా మనము చెప్పవచ్చు. కాబట్టి విశ్వాస విద్యార్థులు కూడా ఈ విద్యా సం॥ ప్రారంభం నుండే అవసరమైన నైపుణ్యాలను పెంపొందించు కోవడము మీద దృష్టి సారించినట్లయితే ఉద్యోగము సాధించడం కష్టమేమీ కాదు.

## 4. ప్రార్థన

ప్రార్థన అనేది మన బాధ్యత మరియు పని. హీనమైన పాపము ప్రార్థన చేయకపోవడం లేదా ప్రార్థనలేమి. "యెడతెగక ప్రార్థన చేయుడి" (1 థెస్స 5:17) అని దేవుని వాక్యం చెబుతుంది. మనము విసుగక నిత్యము ప్రార్థన చేయాలని యేసుక్రీస్తు ఆశిస్తున్నాడు,ఆజ్ఞాపిస్తున్నాడు. ప్రార్థన అనేది ఒక పోరాటమని బైబిల్ సెలవిస్తుంది. ప్రార్థనలో పోరాటం చేయనివాడు పాపంతో చేసే పోరాటంలో ఓడిపోతాడు.

ప్రార్థనకు సమయం ఇవ్వకుండా మనము ఏమీ సాధించలేము. దానియేలు రోజులో ప్రార్థనను ఆపకుండా ఉండడం కోసము రాత్రి సింహాలతో ఉండడానికి ఇష్టపడ్డాడు. బైబిల్లో ఉన్న భక్తులందరూ బయట పోరాటాలు గెలవడానికి ముందు ప్రార్థనలో పోరాడారు. గెత్సెమనే తోటలో యేసుక్రీస్తు మోకాళ్ళ మీద నుండి లేచిన వెంటనే యుద్ధము లేదా పోరాటము ముగిసింది. కాబట్టి ప్రార్థనను మన జీవితాలలో ఒక క్రమశిక్షణగా మార్చుకోవాలి. ప్రతి రోజు అన్ని సమయాల్లో, అన్ని స్థలాల్లో ఆయన సన్నిధిని అనుభవించడానికి అభ్యాసం చేస్తూ ఆయన శక్తిని పొందుదాం.

## 5. వినయము

గర్వము మన గొప్ప శత్రువని, వినయము మన గొప్ప స్నేహితుడు అని జాన్‌స్టాట్ అంటాడు. వినయమును "బానిస నైతికత యొక్క లక్షణము" అని ఫ్రెంచ్ ఫిలాసఫర్ నీచే అంటాడు. "మానవ పురోగతికి వినయము పెద్ద ఆటంకమని" అరిస్టాటిల్ చెబుతూ దీనిని తన యొక్క సుగుణాల లిస్ట్‌లో నుంచి తీసేశాడు. సెయింట్ అగస్టీన్ అనే భక్తుడు "క్రైస్తవ బోధ యొక్క సారాంశము వినయము లేదా దీనత్వము" అని అంటాడు. వినయము సేవ లేదా పరిచారము చేస్తుంది. మనలను తగ్గించుకొని ఇతరులను పైకెత్తుతుంది. యేసుక్రీస్తు నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడనని తన గురించి తాను చెప్పుకొంటాడు. ఆయన యందు విశ్వాసముంచిన మనం కూడా వినయం కలిగి జీవించాలి.

## 6. పరిశుద్ధత

మన చుట్టూ ఉన్నవారిలా ఉండడానికి దేవుడు మనల్ని పిలవలేదు. ఆయన మనలను తనలా ఉండడానికి పిలిచాడు. పరిశుద్ధమైన వ్యక్తి దేవుని చేతిలో బలమైన ఆయుధం లాంటివాడు. మన లక్ష్యము సంతోషం కాదు గానీ పరిశుద్ధత, క్రీస్తుపోలిక లోనికి మార్చబడడమే. మనలను పరిశుద్ధపర్చడానికే యేసుక్రీస్తు మరణించాడు (ఎఫెసీ 5:26-27). పాపము పట్ల నీకున్న ప్రేమను నువ్వు చంపకపోతే, దేవుని పట్ల నీకున్న ప్రేమను పాపము చంపుతుంది. పాపంపై నీ ప్రేమను చంపు లేదా పాపము దేవుని పై నీకున్న ప్రేమను చంపుతుంది.

యేసుక్రీస్తు సిలువలో చనిపోవడానికి కారణమైన పాపంలో ఆనందించడం లేదా వినోదాన్ని పొందడం ఎంత బాధాకరమైన విషయమో కదా. యేసుక్రీస్తులో పరిశుద్ధులమైన మనము యేసుక్రీస్తులా జీవించడం నేర్చుకోవాలి. మనకు పవిత్రత అనేది ప్రాణము కన్నా ప్రియమైనది కావాలి. ఒక భక్తుడు "ఓ ప్రభువా, రక్షించబడిన పాపి ఎంత పవిత్రముగా జీవించగలడో అంత పరిశుద్ధునిగా నన్ను చేయండని" ప్రార్థన చేస్తాడు. అదే మన ప్రార్థన కావాలి.

## 7. కష్టపడడం

దేవుడు తన గురించి తాను వెల్లడించిన మొదటి విషయం పని. "ఆదియందు దేవుడు సృష్టించాడు" (ఆది 1:1). ఏడవ దినమున దేవుడు తాను సృజించినట్టియు, తాను చేసిన పని అంతటినుండి విశ్రమించాడు (ఆది. 2:3). మానవుడికి ఆ సమయంలోనే దేవుడు పనిని ఇచ్చాడు. దేవుడు ఎల్లప్పుడు పనిచేస్తూనే ఉన్నాడు. పాపము మానవ జాతిలోకి ప్రవేశించడానికి ముందు, అప్పటికే ఉన్న ప్రపంచాన్ని కలుషితం చేయడానికి ముందే, మనిషి దేవుని తరపున పనిచేయడానికి రూపించబడి, నియమింపబడ్డాడు. మానవజాతి ఎందుకు పని చేయాలి? మానవుడు "పనిచేసే" దేవుని స్వరూపంలో సృష్టించబడ్డాడు కాబట్టి. క్రైస్తవుడు ఏదైనా న్యాయబద్ధమైన పనిని దేవునికి సేవ చేసే సాధనంగా చూడాలి. పని అనేది దేవుని నుండి వచ్చిన పిలుపు.

విద్యార్థులైతే చదవడం దేవుడిచ్చిన పని, ఉద్యోగస్తులైతే ఉద్యోగం దేవుడిచ్చిన పని, కమిటీ సభ్యులుగా ఉండడం దేవుడిచ్చిన బాధ్యత. సోమరులుగా ఉండడం దేవుని చిత్తము కాదు. క్రైస్తవులు కష్టపడి పనిచేయాలి. కష్టతరమైన మార్గాలు తరచుగా అందమైన గమ్యస్థానాలకు చేరుస్తాయి.

– డా. నాసరయ్య, వైజాగ్

థియాలజీ



# క్రైస్తవ సిద్ధాంతం

వేరే ఏ కారణం లేకపోయినా కనీసం తప్పుడు తత్వజ్ఞానాన్ని ఎదిరించడానికైనా సరైన తత్వజ్ఞానం ఉనికిలో ఉండాలని అంటాడు ప్రముఖ క్రైస్తవ మేధావి సి.యస్.లూయిస్. ప్రస్తుతం క్రైస్తవ్యానికి గొప్ప ప్రమాదం సంఘం బయటినుండి కాదు, అంతర్గతంగా తప్పుడు సిద్ధాంతాల రూపంలో సంఘం లోపలే పొంచి ఉంది. కాబట్టి, లేఖనానుసారమైన సిద్ధాంతాల అవసరం ఎంతైనా ఉంది. దేవుని వాక్య సత్యాల్ని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి దోహదపడే సిద్ధాంతాలను నిర్లక్ష్యం చేసే ఏ క్రైస్తవుడూ ఆరోగ్యవంతమైన క్రైస్తవ జీవితాన్ని జీవించలేడు. అలాగే, బాహ్య సవాళ్ళను ఎదుర్కోలేక, ఆధ్యాత్మిక అభివృద్ధి కుంటుపడి, నిత్యం తడబాటుకు లోనయ్యే అసంపూర్ణ క్రైస్తవుడిగా మిగిలి పోవలసి వస్తుంది. క్రైస్తవ సిద్ధాంతాలను క్రైస్తవులు విస్మరించడమంటే భవనాల నుండి పునాదుల్ని, శరీరాల నుండి అస్థిపంజరాలను, చెట్ల నుండి వేర్లను వేరు చేయడంతో సమానం.

## నిర్వచనం

క్రైస్తవ సంఘం ఏమి నమ్ముతుందో, బోధిస్తుందో దానినే క్రైస్తవ సిద్ధాంతంగా నిర్వచిస్తారు జరోసాల్వ్ పెలికన్. లేఖనానుసారమైన నిర్దిష్ట బోధనాంశాల్ని, బోధనా ప్రక్రియను క్రైస్తవ సిద్ధాంతాలుగా పేర్కొనవచ్చును. దైవశాస్త్ర (theology) సత్యాలను వివరించే లేఖనపరమైన బోధే క్రైస్తవ సిద్ధాంతం.

విలక్షణ వ్యక్తిత్వం, జీవితం కల్గిన యేసుక్రీస్తు ప్రాముఖ్యత మూలంగా ఉన్న సువార్త సందేశ పునాదిపై క్రైస్తవ్యం స్థాపితమైంది. ఈ సందేశాన్ని నిర్వచించి, వివరించే సమగ్ర దైవశాస్త్ర సత్యాల్ని సూచించేదే సిద్ధాంతము (1 తిమోతి 1:10, 4:16; తీతు 1:9).

## ప్రాముఖ్యత

**క్రైస్తవ్యానికి అనివార్యం:** సిద్ధాంతం క్రైస్తవ్యానికి తప్పనిసరి. అది లేకుండా క్రైస్తవ్యం ఉనికిలో ఉండే అవకాశం లేదు. హితబోధ యొక్క విలువను గురించి, ప్రాముఖ్యత గురించి నూతన నిబంధన మళ్ళీ మళ్ళీ ఉద్ఘాటిస్తుంది (1 తిమోతి 6:3; 1:10; 2 తిమోతి 1:13,14). అపొస్తలుల క్రైస్తవ విశ్వాసాన్ని సిద్ధాంత రూపంలో సూత్రీకరించి దాన్ని సంఘానికి అందించి, కాపాడమని ఆదేశించారు (1 కొరింథీ 15:3; గలతీ 1:8; 2 తిమోతి 1:13,14; యూదా 3). యేసుక్రీస్తుకు మంచి పరిచారకులుగా ఉండడానికి సుబోధ సంబంధమైన వాక్యములను హత్తుకొని జీవించమని హెచ్చరించారు (1 తిమోతి 4:6).

**విశ్వాసి జీవన విధానానికి మూలం:** క్రైస్తవ

జీవితాన్ని, క్రైస్తవ సిద్ధాంతాన్ని వేరుగా చూడడం తగదు. సిద్ధాంతాలను వివరించాకే నైతిక, ఆధ్యాత్మిక నియమాలను బోధించడం తరచుగా నూతన నిబంధనలో చూస్తాము. నైతిక, ఆధ్యాత్మిక సిద్ధాంతాలను వెంబడిస్తాం.

**ఆధ్యాత్మిక పరిణతిని ప్రభావితం చేస్తుంది:** తీవ్ర వ్యతిరేకత మధ్య నిరీక్షణ-పునరుత్థాన సిద్ధాంతం ద్వారాను, విశ్వాసుల్లో వినయపూర్వక వైఖరి-క్రీస్తు మానవావతార సిద్ధాంతం ద్వారాను, విశ్వాసుల మధ్య సత్సంబంధాలు – క్రీస్తు ద్వారాను, మనుషులు దేవునితో సమాధానపడే సిద్ధాంతం ద్వారాను వస్తాయి. క్రీస్తుతో మన సంబంధాన్ని, క్రీస్తు గురించిన సిద్ధాంతం ప్రభావితం చేస్తుంది. క్రీస్తుపట్ల మన ప్రేమకు ఆయనను గూర్చిన జ్ఞానం ప్రేరణనిస్తుంది. అది లేనినాడు లోతైన అనుభవం లేని, నిబద్ధత లేని క్రైస్తవులంగా మిగిలిపోవడం సహజమై పోతుంది.

**సర్వసత్యంలోనికి నడిపిస్తాయి:** మన గురించి, మన చుట్టూ ఉన్న వాస్తవాన్ని గురించి దేవుని గురించి విశదపరచి సత్యాన్ని తెలియజెప్పడమే క్రైస్తవ సిద్ధాంత లక్ష్యం. మనం సత్యాన్ని తెలిసికొని దాని ప్రకారం నడుచుకొనేటట్లు క్రైస్తవ సిద్ధాంతం ప్రోత్సహిస్తుంది. సత్యం మనల్ని స్వతంత్రులనుగా చేస్తుంది గనుక లోపరహితమైన దైవప్రేరిత లేఖనాల నుండి రూపొందించిన సిద్ధాంతాలు మనల్ని సర్వసత్యంలోకి నడిపిస్తాయి. కాబట్టి, తప్పుడు సిద్ధాంతాలను కనిపెట్టడానికి సరైన సిద్ధాంతాలను గురించి అవగాహన అనివార్యం. కాబట్టి క్రైస్తవ సిద్ధాంతాలు కేవలం క్రైస్తవులు నమ్మే సత్యాలు కాదు. క్రైస్తవేతరులు మారడానికి సవాలు చేసే సాధనాలు కూడా.

**మానవుని అనుభవాలకు అర్థాన్ని ఇస్తుంది:** సిద్ధాంతం మానవ అనుభవాలను వివరించి అర్థం చెబుతుంది. లోకంలోని ఏ వ్యక్తి, ఏ వస్తువు సంతృప్తి పరచలేనంత ఖాళీతనం మానవ హృదయాన్ని వేధిస్తుంది. మనిషి తనను తృప్తిపరిచే వాటి కోసం వెదకి అసంతృప్తితోనే మిగిలి పోతున్నాడు. మానవుని అసంతృప్తికి కారణమేంటో, ఏది తనను తృప్తి పరచగలదో సిద్ధాంతం వివరిస్తుంది.

**విలక్షణతను వివరించి, గుర్తింపునిస్తాయి:** బైబిల్‌లోని 66 మూల గ్రంథాలు దైవావేశం వలన కలిగినవని, లోప రహితమైనవని మన విశ్వాసం మీద ప్రవర్తన మీద సంపూర్ణ అధికారం గలవని అంగీకరించడం, యేసుక్రీస్తు ప్రత్యామ్నాయ, ప్రాతినిధ్య మరణం ద్వారానే పాపపు పర్యవసానాల నుండి విడుదల మరియు దేవునితో సమాధాన స్థితి పొందుతామని రాజీలేని విశ్వాసాన్ని ప్రకటించడం ద్వారానే మన పరిచర్యకు 'ఇవాంజలికల్' గుర్తింపు వచ్చింది.

> **"సాతాను మనందరికంటే మంచి వేదాంతి అయినా, ఇంకా సాతానే" అని అంటాడు ఎ.డబ్ల్యు.టోజర్. సిద్ధాంత లక్ష్యం జీవితాలు రూపాంతరం చెందడమని మరవకూడదు. సిద్ధాంతాలు నిస్సారంగా అనిపించడానికి ప్రధాన కారణం ఆ ప్రత్యేక సిద్ధాంత సత్యాలు, వ్యక్తి జీవితం ఎక్కడ కలుసుకొంటాయో చెప్పకుండా విస్మరించడమే. అన్వయం లేని సిద్ధాంతం వ్యర్థం.**

దేవుడు బయలు పరచిన సత్యంలో వేరుపారి ఫలించడానికి, నిత్యం మారిపోయే లోక పోకడలను అనుసరించి కొట్టుకొని పోకుండా స్థిరంగా సత్యమందు నిలవడానికి, ఉపయుక్తమైన క్రీస్తు సందేశాన్ని సమకాలీన ప్రపంచానికి చాటడానికి క్రైస్తవ సిద్ధాంత అధ్యయనం, బోధన అవసరం.

## ఎలా సిద్ధపడాలి?

**1. లేఖనాల్లోని సమాచారాన్ని సేకరించడం:** బైబిల్ సిద్ధాంతాల పాఠ్యపుస్తకం కాదు, కాబట్టి ఏదైనా ఒక ప్రత్యేక సిద్ధాంతాన్ని గూర్చిన సమాచారమంతా ఒకే చోట లభ్యం కాదు. ఏదైనా ఒక అంశం గూర్చి బైబిల్ మొత్తంగా ఏమి బోధిస్తుందో అది ఆ అంశాన్ని గూర్చిన క్రైస్తవ సిద్ధాంతం గనుక, కేవలం కొన్ని భాగాల్ని మాత్రమే గాక సమగ్రంగా సమాచారాన్ని సేకరించవలసి ఉంటుంది. సిద్ధాంతాల్ని సూత్రీకరించేటప్పుడు కొన్ని లేఖన భాగాల్ని మాత్రమే ఎంచుకొని మిగిలిన వాటిని విస్మరించడంవల్ల తప్పుడు సిద్ధాంతాల బారినపడే అవకాశం ఉంది.

లేఖనాలనుండి సమాచారాన్ని సేకరించేటప్పుడు లేఖనభాగ రచయిత మూల పాఠకులకు ఏ

లక్ష్యంతో, ఏ ఉద్దేశాలతో ఆ వాక్యాలను రాశారో పరిశీలించి గుర్తించడం అత్యంత ప్రధానం. రచయిత ఉద్దేశించని అర్థాన్ని లేఖన భాగాలకు ఆపాదించి చూపడంవల్ల అది సిద్ధాంతాలను తప్పుగా అర్థం చేసుకొనేలా చేస్తుంది.

*లేఖన సమాచారాన్ని సేకరించడానికి ఈ క్రింది సాధనాలు సహకరిస్తాయి.*

1. వివిధ తర్జుమా బైబిల్ (NIV, NASB, ESV etc.,)
2. బైబిల్ నిఘంటువులు (డిక్షనరీ)
3) బైబిల్ వ్యాఖ్యానాలు (కామెంటరీ)
4. బైబిల్ పదకోశాలు (కంకార్డెన్స్)
5. సిద్ధాంతాలపై రాసిన పుస్తకాలు

**2. సేకరించిన సమాచారాన్ని క్రమబద్ధీకరించడం:** లేఖనభాగ రచయితలు వివిధ సందర్భాలలో ఒక అంశం గూర్చి ఏమి బోధించారో ఆ సమాచారాన్నంతటిని పొందికగా, మొత్తంగా క్రోడీకరించాలి. విస్పష్టంగా బోధించిన విషయం వెలుగులో అస్పష్టమైన వాటిని అర్థం చేసుకొనే ప్రయత్నం చేయాలి. రచయితలు అంగీకరించిన విషయాల్ని ముందుచూసి తర్వాత విభేధిస్తున్నట్లుగా కనిపించే విషయాల పట్ల దృష్టి కేంద్రీకరించాలి.

**3. చారిత్రక వివరణలు పరిశీలించాలి:** క్రైస్తవసంఘ అంతర్గత అవసరాలు, బాహ్య సవాళ్ళ దృష్ట్యా కొన్ని ప్రత్యేక సిద్ధాంతాలపై దృష్టి కేంద్రీకరించడం చారిత్రక సత్యం. చరిత్రలో ఒక ప్రత్యేక సిద్ధాంతాన్ని ఏ పరిస్థితుల్లో ఎలా సూత్రీకరించారో తెలిసికొంటే అలా సూత్రీకరించడంవల్ల వచ్చిన ఫలితాల వెలుగులో సమకాలీన సూత్రీకరణని అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. అంతేకాకుండా వాటినుండి ఎలా సూత్రీకరించాలో నేర్చుకోవచ్చు.

**4. సిద్ధాంతానికి ఎదురయ్యే సమకాలీన సమస్యల్ని, జవాబుల్ని సేకరించడం:** బైబిల్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా ప్రజల్లో వ్యాపించిన/ప్రాబల్యంలో ఉన్న తప్పుడు సిద్ధాంతాల్ని గుర్తించాలి. బైబిల్ బోధిస్తున్న సిద్ధాంతం ఎందుకు సత్యమైనదని చూపించే తాత్విక, చారిత్రక, శాస్త్రీయ ఆధారాలను సేకరించాలి. ఏమి నమ్మాలి అనేకాదు, ఎందుకు నమ్మాలి అనేది కూడా బోధించడానికి ఈ ఆధారాలు దోహదపడతాయి.

**5. బోధించవలసిన సిద్ధాంతాల్ని రాసుకోవాలి:**

***బోధించేటప్పుడు సిద్ధాంతాలలో ఉండాల్సిన ప్రధాన భాగాలు:***

**ఎ) పరిచయం:** సిద్ధాంతాన్ని వినే వారిలో ఆసక్తిని కలిగించేటట్లు, వారి దృష్టిని ఆకర్షించే విధంగా తయారు చేసుకోవాలి. సిద్ధాంతం యొక్క ప్రాముఖ్యత, దాని ప్రభావం, చారిత్రక నేపథ్యం, విశిష్టతలు మొదలైనవి ఉండేటట్లు చూసుకోవాలి. సిద్ధాంతంలో ఇమిడి ఉన్న సమస్యలు ప్రస్తావించవచ్చు.

**బి) ప్రధాన భాగం:** మొత్తం సిద్ధాంతాన్ని శ్రోతలు గ్రహించడానికి వీలుగా ఉండేటట్లు 3 లేక 4 ఉపభాగాలుగా విభజించుకొని, ప్రతి ఉప భాగానికి ఆకర్షణీయమైన శీర్షిక పెట్టుకోవాలి. ప్రతీ ఉప భాగంలో ప్రస్తావించే సత్యాన్ని విస్పష్టంగా వివరించే లేఖన భాగాల్ని ఎంచుకొని రాసుకోవాలి. ఆ ఉపభాగం యొక్క సారాంశాన్ని చివర్లో క్రోడీకరించాలి. కొన్ని దైవశాస్త్ర పదాల్ని సమకాలీన భాషలో వ్యక్తీకరించే విధంగా అర్థాల్ని రాసుకోవాలి.

**సి) అన్వయం:** శ్రోతలు ఎదుర్కొంటున్న సమకాలీన సమస్యలకు జవాబును ప్రతి ఉపభాగం నుండి అన్వయించాలి. "సాతాను మనందరి కంటే మంచి వేదాంతి అయినా, ఇంకా సాతానే" అని అంటాడు ఎ.డబ్ల్యు.టోజర్. సిద్ధాంత లక్ష్యం జీవితాలు రూపాంతరం చెందడమని మరవకూడదు. సిద్ధాంతాలు నిస్సారంగా అనిపించడానికి ప్రధాన కారణం ఆ ప్రత్యేక సిద్ధాంత సత్యాలు, వ్యక్తి జీవితం ఎక్కడ కలుసుకొంటాయో చెప్పకుండా విస్మరించడమే. అన్వయం లేని సిద్ధాంతం వ్యర్థం.

**డి) ముగింపు:** ముగింపు మొత్తం సిద్ధాంతంలో ప్రస్తావించి, వివరించిన అన్ని సత్యాలను క్రోడీకరించేదిగా ఉండాలి. శ్రోతలు ఒక నిర్ణయం తీసుకొనేటట్లు ప్రోత్సహించేదిగా ఉండాలి.

బోధించడం దేవుడు నీకిచ్చిన ఆత్మవరమైతే, దేవుడు నిన్ను బోధించడం కోసం సృష్టించాడని గుర్తెరిగితే బోధించడమే నీ మొదటి ప్రాధాన్యత కావాలి. కాబట్టి నిరంతర అధ్యయనం, బోధించడం ద్వారానే దేవునికి మహిమను, సంఘానికి క్షేమాభివృద్ధిని నీ జీవితం తీసుకురాగలదు. అలా చేయడానికి ఈ వ్యాసం స్ఫూర్తి కావాలని ప్రార్థిస్తూ...

**– డి. అనిల్ కుమార్,** వైజాగ్

# పై చేయి నాదే...



కుటుంబంలో కలహాలు వచ్చినప్పుడు, వివిధ పరిస్థితుల్లో ఎవరిది పై చేయిగా ఉండాలి? భార్యదా? భర్తదా? అనే ఆలోచన తలెత్తుతూనే ఉంటుంది. ఇలాంటి ప్రశ్న మన కుటుంబాల్లో కూడా తలెత్తినప్పుడు దేవుని వాక్యం దగ్గరకు రావాలి. అలాగే వివాహ వ్యవస్థపై ముందు మనకు అవగాహన రావాలి.

## కుటుంబం దేవుడు ఏర్పరచింది

దేవుడు స్త్రీనిగాను, పురుషునిగాను చేశాడు (ఆది 1:27). నరుడు ఒంటరిగా ఉండుట మంచిది కాదని అతనికి సాటియైన సహాయకురాలిగా స్త్రీని చేశాడు. అందుకనే దేవుని వాక్యం “వివాహం అన్ని విషయాలలో ఘనమైనది” (హెబ్రీ 13:4) అని రాయబడింది.

ఇద్దరు ప్రేమికులు, ఇద్దరు క్షమించేవారి మధ్య జరిగిన వివాహమే సంతోషకరమైన వైవాహిక జీవితం.

## వివాహం అన్నది సర్దుబాట్లతో కూడుకొన్నది

వివాహం అంటేనే ఇద్దరు వేరు వేరు వ్యక్తిత్వాలు కలిగినవారు కుటుంబంగా ఏర్పడడం. అనేకమైన విభేదాలు వస్తాయి. మనం పెరిగిన వాతావరణం వేరు, తిన్న రుచులు వేరు, జీవించే తీరు వేరు. ఉప్పు, కారం, ఫ్యాన్ స్పీడ్... చిన్న చిన్న కారణాలు కూడా చికాకును కలుగ జేయవచ్చు. అందుకనే సర్దుబాటు అవసరం. నీకు ఫ్యాన్ స్పీడ్ ఒకటిలో కావాలి, నీ భార్యకు ఐదులో కావాలి. మధ్యలో మూడు ఉందని గుర్తుకు తెచ్చుకొని, ఇద్దరూ ఒక అవగాహనకు రావాలి.

“ఇద్దరు వ్యక్తులు ప్రతిదాన్ని అంగీకరిస్తూ ఉంటే వారిలో ఒకరు అవసరం లేదని” రూత్ బిల్లీగ్రేహం అంటారు. రూత్, బిల్లీగ్రేహంల మధ్య సైద్ధాంతిక బేధాలు ఉన్నప్పటికి వారు, ఒకరి నమ్మకాలను ఒకరు అవమాన పరచకుండా కలిసి జీవించారు.

## సంతోషకరమైన ఇల్లు లాంటి చోటు మరొకటి ఉండదు

ఇంటిలో....

- ప్రేమించుకొంటాం, పంచుకొంటాం.
- ఆడుకొంటాం, నవ్వుకొంటాం.
- పోట్లాడుకొంటాం, క్షమించుకొంటాం.
- కలసి జీవిస్తాం.

అందుకే వెడ్డింగ్‌ను వెల్డింగ్ అని అంటారు.

మత్తయి 19:5,6 కాబట్టి వారికను యిద్దరు గాక ఏక శరీరముగా ఉన్నారు. గనుక దేవుడు జతపరచిన వారిని మనుష్యులు వేరు పరచకూడదు.

## ఎవరిది పై చేయి?

### లోబడి ఉండడం

ఎఫెసీ 5:22-25 వరకు దేవుడు స్త్రీలకు ఇచ్చిన ఆజ్ఞ ఏంటంటే, తమ భర్తలకు క్రీస్తుకి వలె లోబడి ఉండమని. క్రీస్తు సంఘమునకు శిరస్సు, భర్త, భార్యకు శిరస్సు. సంఘము క్రీస్తునకు లోబడి ఉన్నట్లుగా భార్య భర్తకు లోబడి ఉండాలి.

ఒకసారి ఈ ఆజ్ఞను చూస్తే భార్య చేయివలసింది అర్థం అవుతుంది. యేసుక్రీస్తుకు లోబడి ఉండడం. అంటే దేవునికి ఘనత తెచ్చే ప్రతి విషయంలోను భర్తకు లోబడి ఉండడం. దేవునికి వ్యతిరేకంగా ఉన్న విషయంలో సప్పీరా అననీయకు లోబడి ఉంది. ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. అబీగయీలు మూర్ఖుడైన తన భర్తకు లోబడకుండా ఉన్నందున అనేకమంది ప్రాణాలు కాపాడ గలిగింది.

### ప్రేమించడం

దేవుడు పురుషులకు ఇస్తున్న ఆజ్ఞ భార్యలను

ప్రేమించండి. యేసుక్రీస్తు సంఘాన్ని ప్రేమించినట్లుగా ప్రేమించాలి. యేసు సంఘాన్ని ప్రాణం పెట్టేంతగా ప్రేమించాడు. పురుషుడు తన భార్యను ప్రాణం పెట్టేంతగా ప్రేమించ బద్ధుడైయున్నాడు.

యేసు కలుషితమైన కళంకం, ముడత, మచ్చగలిగిన సంఘాన్ని ప్రేమించాడు. భర్త భార్య పట్ల అలాంటి ప్రేమను చూపాలి. సొంత శరీరాన్ని ప్రేమించినట్లు తన భార్యను ప్రేమించాలి. ఎవరైనా తన సొంత శరీరాన్ని గాయపరచు కొంటారా? అవమాన పరచుకొంటారా? ఆలోచించండి.

పై వచనాలను పాటించినట్లైతే ఎంత చక్కటి ఆదర్శ గృహాలను చూడగలం. భార్య భర్తను లెక్క చేయకపోవడం, అతనిని అగౌరవంగా చూడడం దేవుని ఆజ్ఞకు వ్యతిరేకం. అలానే భర్త తన భార్యను బలహీనురాలుగా ఉంటే, ఆమెను కొట్టడం, తిట్టడం, అవమానపరచడం చేస్తే అది దేవునికి వ్యతిరేకంగా ప్రవర్తించడం.

"భార్యా భర్తలు ఒకరినొకరు అందరికంటే ఎక్కువగా, దేవుని కంటే తక్కువగా ప్రేమించుకోవాలి".

## నాదే పై చేయి అనుకోవడానికి గల కారణాలు

- అత్తమామలు... నీ వాళ్ళు, నా వాళ్ళు
- అప్పు చేసి డబ్బు ఖర్చు పెట్టడం
- ఉద్యోగం ఒత్తిడి
- అహం... నా మాటే చెల్లాలి
- వివాహేతర సంబంధాలు
- దేవునితో సంబంధం తగ్గిపోవడం
- ప్రేమలేని మాటలు, కఠినమైన సంభాషణ
- పిల్లలను పెంచడం, శిక్షించడం
- ఏకపక్ష నిర్ణయాలు
- అవమానపరచడం, గాయపరచడం.

## నష్టాలు

- సంతోషం, సమాధానం కోల్పోతాము.
- మాట్లాడుకోవడం ఆగిపోతుంది.
- అరచుకొంటూ, కొట్టుకొంటారు.
- పిల్లల మీద ఘోరమైన ప్రభావం, బాధితులు అవుతారు.
- చుట్టూ ఉన్న సమాజానికి చెడ్డ ఉదాహరణగా అవుతాం.
- మంచి మాదిరిగా ఉండాల్సిన వాళ్ళం, హెచ్చరి కలు చేయించుకొనే వారమవుతాం.
- అందరి ఎగతాళికి గురి అవుతాం.
- దేవుని నామానికి అవమానం తెచ్చేవారిగా ఉంటాం.
- దేవునిని మన కుటుంబం నిమిత్తం దు:ఖించే వానిగా చేస్తాం.

## ఆలోచించండి

- ఏదైనా సలహా చెబితే ఆలోచించు, ఆవేశపడకు, అంతా నాకే తెలుసు అనుకోకు.
- నోర్ముయ్ అన్న మాట ఇద్దరి మధ్య మాటలు లేకపోవడానికి కారణమవుతుంది.
- బెల్ట్‌తో కొట్టిన దెబ్బ హృదయాన్ని పగిలేలా చేస్తుంది.
- క్రూరంగా పోట్లాడుకోవడం వలన పిల్లల మానసిక స్థైర్యం కోల్పోయేలా చేస్తుంది.
- మీ కుటుంబంలో ఉన్న 'నాదే పై చేయి' అన్న వైఖరి ఐక్యతను కోల్పోయేలా చేస్తుంది.

అందుకనే ఎఫెసీ 5:21లో క్రీస్తునందలి భయంతో ఒకరికొకరు లోబడి యుండుడి అని రాయబడింది.

## నాదే పై చేయి అని అనుకోకుండా ఉండడానికి

ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. క్షమించడం, క్షమాపణ అడగడం అలవరచుకొండి.

నాకన్నీ తెలుసు, అన్నీ చేయగలను అని అనుకోకండి. ఎదుటి వారి మాటలు విని, విలువ ఇవ్వండి. దేవుడు ఒకరినొకరికి పరిపూరకమైన వారినిగా చేశాడు. మన లోపాలను ఎదుటివాళ్ళ బలాలతో సరిచేస్తాడు.

ప్రశాంతంగా, సంతోషమైన వాతావరణం కలుగ జేసే వారిగా ఉండండి. కలసి ఆలోచించి, కలసి పనిచేసి, కలసి బడ్జెట్ గురించి ఆలోచించండి. కలసి దేవునికి మహిమతెచ్చేలా కుటుంబాలుగా ఉండాలి.

కలసి చేసే ప్రార్థన... కుటుంబం కలసి ఉండేలా చేస్తుంది.

యెహోషువ అన్న మాట (24:15).. నేనునూ నా యింటివారును యెహోవాను సేవించెదము.

కుటుంబానికి సేవచేయండి, కుటుంబంగా కలిసి దేవుని సేవ చేయండి.

**– యం. జయనేంద్రకుమార్,** గుడివాడ



# ఉన్నత స్థితికి చేరుకోవాలంటే...

ఈ దినాలలో ఎక్కడ చూసినా తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత స్థానంలో చూడాలని పడే తపన కనిపిస్తుంది. ఉదయం 7 గం॥ల నుండి ఆటోలు, స్కూల్ బస్‌ల హడావిడి రోడ్ల మీద ఇంతా అంతా కాదు. ఇక అడ్మిషన్స్ ప్రారంభించే నెలలో మంచి పేరు తెచ్చుకొన్న పాఠశాల ముందు, కాలేజీల ముందు తల్లిదండ్రుల సందడి చెప్పనక్కరలేదు. దక్షిణ భారతదేశంలో మెడిసిన్, ఇంజనీరింగ్ సీట్ల కొరకైన పిచ్చి చాలా ఎక్కువ. ప్రతి తల్లిదండ్రికి ఒకే గురి తమ పిల్లలు ఉన్నత స్థానంలో ఉండాలన్నదే. వారి దృష్టిలో ఉన్నత స్థానం అంటే మంచి రాబడి ఉన్న ఉద్యోగం. అది ఎలాంటి ఉద్యోగమైనా ధన సంపాదన ఉండాలి. ధనవంతుల కుటుంబాలలో ఉన్నతస్థానం అంటే అధికారం, పలుకుబడి. అందుకే వారి పిల్లలకు చదువు అబ్బినా, అబ్బక పోయినా ఫర్వాలేదు. అధికారం, పలుకుబడి లభించే రాజకీయాలు ఎలాగూ ఉంటాయి. భారతదేశంలో ఉన్నత స్థానం అంటే, ధనం లేనివారికి మంచి ఉద్యోగం, ధనం ఉన్నవారికి అధికారం, పలుకుబడి. అయితే ఒక విశ్వాసికి ఉన్నతస్థానం అంటే ఏది? చర్చ్‌లో లేక ఆర్గనైజేషన్‌లో కీలకస్థానమా? పేరు ప్రఖ్యాతులా? ఎలా నిర్ణయిస్తాము? ఉన్నత స్థానం గురించి దేవుని వాక్యం ఏమి చెప్తుంది? మనకు ప్రామాణికం అదే కదా. లూకా సువార్త 22:25,26 వచనాలలో ఉన్నత స్థానాన్ని యేసుక్రీస్తు ప్రభువు నిర్వచించిన విధానం చూసి లోకం విస్తుపోతుంది. అది లోక మర్యాదకు వ్యతిరేకం. ధన సంపాదనకు దేవుని వాక్యం వ్యతిరేకం కాదు, సమాజంలో ఉన్నతమైన అధికార స్థానాలు అధిష్ఠించడం తప్పు కాదు. కాని ఉన్నతి ఎందుకు? ఎవరి కోసం అనే ప్రశ్నలకు సరైన జవాబులు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత మనందరికి ఉంది.

## కష్టపడాలి

తెలుగు రాష్ట్రాలలో అధిక శాతం క్రైస్తవులు దళిత నేపథ్యం కలవారు. సాధారణంగా సాంఘిక వెనుకబాటు మాత్రమేకాక ఆర్థిక స్థోమతలో కూడా వెనుకబాటే. కాని తెలివితేటలకు ఈ వెనుకబాటుతనానికి సంబంధం లేదు. తెలివితేటలు అందరికి దేవుడు సమానంగానే ఇచ్చాడు. సబ్జెక్ట్ మీద శ్రద్ధతో గురి నిలిపి, మూలాంశాన్ని, సూత్రాన్ని నిశితంగా విశ్లేషించి నేర్చుకుంటే సబ్జెక్ట్ మీద పట్టు వస్తుంది. ప్రశ్న ఎలా ఉన్నప్పటికి దానికి సమర్థవంతంగా జవాబు రాయడానికి వీలవుతుంది. విద్యార్థులు చాలాసార్లు విఫలం అవ్వడానికి కారణం కేవలం సోమరితనం, పాఠ్యాంశాన్ని అర్థం చేసుకోవాల్సినరీతిలో అర్థం చేసుకోకపోవడమే. చదువులో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి ఇది సోపానమే గాని అంతిమ గమ్యం కాదు. కాలేజ్‌లో, యూనివర్శిటీలో ఉన్న సాంఘిక వివక్ష కూడా విద్యార్థి మానసిక ప్రవర్తన మీద చాలా ప్రభావం చూపిస్తుంది. వ్యక్తి విలువ ఆ వ్యక్తి సామాజిక నేపథ్యంపై ఆధారపడి ఉంటుందని చెప్పే ఈ లోకవ్యవస్థ

అబద్ధానికి చాలామంది ఎదురు నిలువలేరు. ఇక ఆర్థిక ఇబ్బందులు తప్పకుండా విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్ళడానికి అవరోధమే! అవసరమైన పుస్తకాలు, ట్యూషన్, సమాచార సేకరణ, విశ్వవిద్యాలయాలకు కట్టవలసిన రుసుము, హాస్టల్ వసతులు మొదలైన ఖర్చులు తప్పనిసరి. కాని ఇటీవల కాలంలో ప్రతి సబ్జెక్ట్‌కి కావలసిన సమాచారం అంతా ఇంటర్‌నెట్‌లో మనకు అందుబాటులోనికి వచ్చేసింది. కాబట్టి కష్టపడి నేర్చుకొనేవారికి అంతులేని సమాచారం దొరుకుతుంది. పబ్లిక్ లైబ్రరీలలో కూడా ఇంటర్‌నెట్ సహకారాన్ని ఉచితంగా అందజేస్తున్నారు. విద్యాపరంగా ఉన్నత స్థానానికి వెళ్ళడానికి ఆకాశమే హద్దు.

### కుటుంబ నేపథ్యాలు ప్రాముఖ్యం కాదు

లూకా సువార్త 22:25-27లో దేవాది దేవుని కుమారుడు, సర్వాధికారి, సర్వోన్నతుడు చెప్తున్న మాటల్ని జాగ్రత్తగా ఆలకిద్దాం. ఉన్నత స్థానాలు ఆక్రమించాలి, అందరిలో ప్రముఖులుగా ఉండాలనే వారి మనసు ఎలా ఉండాలో ప్రభువు చెబుతున్నారు. ఎందుకంటే మన చుట్టూ ఉన్న ఈ 'ప్రపంచ ధర్మం' ఔన్నత్యాన్ని, ప్రాముఖ్యతను మరోవిధంగా చూస్తుంది. ఈ ఔన్నత్యాన్ని సంపాదించుకొనే మార్గం కూడా భిన్నంగా బోధిస్తుంది. మత్తయి 23:12లో "తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గించబడును; తన్నుతాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును" అని ప్రభువే చెప్పారు. ఉన్నతస్థానం అధిరోహించడానికి మనసు చాలా ప్రముఖ పాత్ర పోషిస్తుంది. కుటుంబ నేపథ్యాలు, ఆర్థిక ఇబ్బందులు కొంతవరకు అవరోధాలుగా నిలిచినప్పటికీ, అవి అధిగమించడానికీ కావలసిన శక్తిని పొందుకొనే మార్గం దేవుని వాక్యంలో స్పష్టంగా రాయబడింది.

### తన్నుతాను తగ్గించుకోవాలి

తన్నుతాను తగ్గించుకోవడం అంటే ఏంటి? తగ్గించుకొనేవాడు ఉన్నత స్థానానికి ఎలా వెళ్ళగలడు? లోకం ఆ వ్యక్తిని ఎలా వెళ్ళనిస్తుంది? కుటుంబ నేపథ్యాలు, ఆర్థిక ఇబ్బందులతో పాటు తన్నుతాను తగ్గించుకొంటూ ఉంటే ఒక వ్యక్తి ఉన్నత స్థానానికి వెళ్ళడం అసాధ్యమనిపిస్తుంది. కానీ దేవుని వాక్యం ఎప్పుడూ తప్పు బోధించదు. తన్నుతాను తగ్గించుకోవడం అంటే కష్టపడకుండా ఉండడం, మంచి ఉద్యోగం కోసం సిద్ధపడకూడదని, పోటీ ప్రపంచంలో నుంచి నిష్క్రమించడం, డబ్బు సంపాదించకూడదని, అందరి ముందు చేతకాని వానివలె జీవించడమని అర్థం కాదు. తన్నుతాను తగ్గించుకోవడం అనేది వ్యక్తి మనసుకు సంబంధించిన గొప్ప సాధన. అది ఆత్మ దేవుని సహాయం ద్వారా సాధ్యమవుతుంది. విశ్వాసి తన స్వంత శక్తి మీద మాత్రమే ఆధారపడుతూ, దేవుని సహాయం లేకుండా జీవిస్తే తన ఉనికికి, ఔన్నత్యానికి అర్థం లేదని గుర్తించి తన ప్రతి ప్రగతిలో దేవునికి ఇవ్వవలసిన ఘనతను ఆయనకు చెల్లించడమే. దేవునితో ఆ వ్యక్తికి గల వ్యక్తిగత సహవాసం, ఆ వ్యక్తిలో ఎలాంటి గర్వానికి తావు లేకుండా చేస్తుంది. తగ్గించుకొనే వ్యక్తికి మాత్రమే దేవుని దగ్గర నుండి అద్భుతమైన కృప లభ్యమవుతుంది.

యేసుప్రభువు ఈ లోకంలో ఉన్నప్పుడు వ్యభిచారులకు, దొంగలకు, అబద్ధికులకు, నరహంతకులకు నేను శత్రువుని లేక వ్యతిరేకిని అని అనలేదు. వ్యభిచారంలో పట్టబడిన స్త్రీని చూచి అమ్మా నేనును నీకు శిక్ష విధించను సమాధానము గలదానవై పొమ్ము అన్నాడు. బెతెస్థ కోనేటి దగ్గర ఏదో పాప కారణము వలన 38 సం॥ముల నుండి పడియున్న పక్షవాయువు గల వానిని బాగుచేసి, ఇంతకన్నా ఎక్కువ శిక్ష పొందకుండునట్లు పాపము చేయవద్దు అని చెప్పాడు. సిలువ మీద దొంగ తన పాపము విషయము పశ్చాత్తాప పడినపుడు క్షమించి నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉంటావని చెప్పాడు. ఐదుసార్లు విడాకులు తీసుకొని ఆరవ వ్యక్తితోనున్న స్త్రీని కూడ క్షమించి సమరయ దేశంలో ఉజ్జీవానికి వాడుకొన్నాడు. కాని తమ్మునుతాము హెచ్చించుకొంటూ, స్వనీతిపరులుగా తలంచుకుంటూ, తక్కినవారిని తమకంటె తక్కువవారిగా చూచే గర్విష్టులైన పరిసయ్యులను ఆయన క్షమించలేదు. ఈ లోకంలో దేవుడు ఎవరికైనా వ్యతిరేకంగా పనిచేస్తాడా? శత్రువుగా ఉంటాడా? అంటే అవును వాళ్ళ పేరే 'గర్విష్టులు'. వాళ్ళు దేవునికి అసహ్యులు.

### తగ్గించుకోనేవారికి దేవుని తోడు సమృద్ధిగా ఉంటుంది

తగ్గించుకోవడం అనే మంచి నేలపై, విశ్వాస సుగుణాలన్ని మొలుస్తాయి. ఆ మంచి నేల మీద

దేవుని కృప అనే వర్షం కురుస్తుంది. దేవుని తోడు ఆ వ్యక్తికి సమృద్ధిగా ఉంటుంది. ఎందుకంటే మహాఘనుడు, మహోన్నతుడు నివసించే స్థలం అక్కడే! (యెషయా 57:15). ఆయన అబద్ధం చెప్పడు. దేవుడే ఆ వ్యక్తితో నివాసం చేస్తున్నప్పుడు ఆ వ్యక్తి యొక్క సామర్థ్యం, నైపుణ్యం, ఆలోచనా విధానం, ప్రణాళికలు, నిర్ణయాలు ఎలా ఉంటాయో ఊహించగలము. అప్పుడు సామాజిక నేపథ్యం, ఆర్థిక ఇబ్బందులు తాత్కాలికంగా ఇబ్బంది కలిగించినా అవి ఆ వ్యక్తి ఉన్నతిని ఏమాత్రం అడ్డుకొనలేవు.

## హన్నా, మరియల సాక్ష్యం

పాతనిబంధనలో హన్నా, కొత్తనిబంధనలో మరియ మాటలు ఈ సత్యాన్ని వివరిస్తాయి.

"యెహోవా అనంతజ్ఞానియైన దేవుడు, ఆయనే క్రియలను పరీక్షించువాడు. కాబట్టి, గర్వపు మాటలు మీ నోట రానీయకుడి. ప్రఖ్యాతినొందిన విలుకాండ్రు ఓడిపోవుదురు. తొట్రిల్లినవారు (బలహీనులు) బలము ధరించుకొందురు. తృప్తిగా భుజించిన వారు అన్నము కావలెనని కూలికి పోవుదురు. ఆకలిగొనినవారు ఆకలి తీర తిందురు. .... యెహోవా దారిద్ర్యము ఐశ్వర్యమును కలుగజేయువాడు. కృంగచేయువాడును లేవనెత్తువాడును ఆయనే. దరిద్రులను అధికారులతో కూర్చుండబెట్టుటకును, మహిమగల సింహాసనమును స్వతంత్రింపచేయుటకును వారిని (దీనులను) మంటిలో నుండి ఎత్తువాడు ఆయనే. లేమి గలవారిని పెంటకుప్ప మీద నుండి లేవనెత్తువాడు ఆయనే" – ఇది హన్నా సాక్ష్యము (1 సమూ 2:2-8).

"నా ప్రాణము ప్రభువును ఘనపరచుచున్నది. ఆయన తన దీనురాలి దీన స్థితిని కటాక్షించెను... ఆయన తన బాహువుతో పరాక్రమము చూపెను. వారి హృదయములో ఆలోచన విషయమై గర్విష్టులను చెదరగొట్టెను. సింహాసనముల నుండి బలవంతులను పడద్రోసి దీనులనెక్కించెను. ఆకలిగొనిన వారిని మంచి పదార్థములతో తృప్తిపరచి ధనవంతులను వట్టి చేతులతో పంపివేసెను". ఇది మరియ సాక్ష్యము (లూకా 1:46,47).

పై వచనాలు గమనిస్తే, ఆ ఇద్దరి స్త్రీల సాక్ష్యము మనకు ఒక విషయాన్ని స్పష్టం చేస్తుంది. లోకంలో విశ్వాసులుగా మనం ఎదుర్కొనే పరిస్థితులు, సామాజికంగా మనలను అడ్డుకొనే నేపథ్యాలు, ఆర్థిక పరిస్థితులు మనలను పిరికివానిగా చేయకూడదు. నిరాశావాదములోనికి నెట్టివేయకూడదు. మన విలువ, మన సామాజిక నేపథ్యం మీద కానీ ఆర్థిక పరిస్థితి మీద గానీ ఆధారపడి లేదన్న నగ్నసత్యం మనకర్థం కావాలి. మనం ఎవరికి సంబంధించిన వారమో దానిపై మన విలువ ఆధారపడి ఉంటుందని అర్థమయితే ఔన్నత్యం, సింహాసనాలు, కిరీటాలు దేవుని మాటలు గౌరవించే దీనుల కొరకు వేచి ఉన్నాయని ఎరుగుతాము. అలా కృంగిపోక దేవుని తోడు కోసం దీనులై, విశ్వాసంతో జీవించిన యోసేపు, దానియేలు, దావీదు, సమూయేలు, మొదలగు వారి జీవితాలు దేవుని వాక్యంలో మనకు సాక్ష్యార్థంగా నిలిచి ఉన్నాయి.


## దీనులకు దేవుడు కృప ఇస్తాడు

యుఇయస్ఐ-ఏపిలోని గ్రాడ్యుయేట్స్, స్టూడెంట్స్ దేవుని కొరకు రోషముతో దీనులుగా జీవించినపుడు దేవుని నామం మన దేశంలో ఘనపరచబడుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఎందుకంటే నిజమైన దీనత్వం దేవుని ఘనపరుస్తుంది. తనను ఘనపరచువానిని తప్పక ఘనుపరుస్తానని చెప్పినవాడు అలా చేయకుండా మానడు. దీనులకు దేవుడు కృప ఇస్తాడు కాబట్టి వారు పాపాన్ని జయిస్తారు. అలాంటి వారు ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నా లేకపోయినా, వారిని బట్టి ఆ ఉద్యోగానికి ఔన్నత్యం వస్తుంది. వారెక్కడ ఉన్నా వారు ప్రముఖులుగా గుర్తించబడతారు. గర్విష్టులు పాపాన్ని జయించలేరు. దేవుడు వారికి వ్యతిరేకిగా ఉండి వారిని ఎదిరిస్తాడు. కాబట్టి వారు ఉన్నత స్థానాల్లో ఉన్నప్పటికీ, ఆత్మీయంగా ఓడిపోయిన వారుగాను, దేవుని దృష్టిలో తృణీకరించబడిన వారిగా ఎంచబడతారు.

## ముగింపు

ప్రియ సహోదరుడా, సహోదరీ! నీవు దీనుడవు, దీనురాలవని దేవుడు నీ గురించి చెప్పగలడా! దానికి రుజువు పాపము మీద విజయము, ఆత్మ ఫలము గల జీవితం. నీవు గర్విష్టివా? జాగ్రత్త! దేవునిని నీకు శత్రువుగా చేసుకొంటావు. దానికి రుజువు నీకు పాపము మీద జయము ఉండదు. దేవుని కృప నీకు దూరమవుతుంది. ఔన్నత్యం నీకు అందని ద్రాక్షలా ఉంటుంది ఎందుకంటే "సర్వోన్నతుడు" దీనుల పక్షం.

**– కె. దేవిడ్‌రాజ్ కుమార్,** గుంటూరు



# ఇగ్నేషియస్
## గాడ్ బేరర్

ఐపియల్ క్రికెట్ గురించి భారతదేశంలో తెలియని వ్యక్తులు ముఖ్యంగా యువ్వనస్తులు ఉండరేమో! మైదానంలో ఆడే ఆటగాళ్ళు 11 మందే కానీ వినోదం కోసం వీక్షించే వారు లక్షల్లో ఉంటారు. మొదటి శతాబ్దంలో ఈ రకమైన వినోదాన్ని పంచే మైదానాలకు పెట్టింది పేరు రోమా సామ్రాజ్యం. ఈ మైదానాలను రోమన్స్ కొలీజియన్స్ అని పిలిచేవారు. అయితే వీక్షకుల వినోదానికి మైదానంలో జరిగేది ఆట కాదు యుద్ధం. మనుషులకు క్రూరమృగాలకు మధ్య, మనుషులకు మనుషులకు మధ్య జరిగే పోరాట సన్నివేశాలను చూడడానికి ప్రేక్షకులు ఎగబడేవారు. అయితే క్రీ.శ 60వ సంవత్సరం నుండి క్రీ.శ 300 వరకు క్రైస్తవ విశ్వాసుల మీదకి క్రూరమృగాలను వదిలి చంపుతూ ఒకే మైదానంలో వందల మందిని సిలువలు వేస్తూ, బతికి ఉన్న శరీరాలను కాల్చుతూ ఆ వెలుగులో ప్రయాణం చేస్తూ వినోదం పొందడాన్ని పరిచయం చేశాడు నీరో అనే రోమా చక్రవర్తి. దానిని ట్రేజన్ అనే మరో రోమా చక్రవర్తి కొనసాగిస్తూ వచ్చాడు.

క్రీస్తు శకం 117వ సం॥. రోమా సామ్రాజ్యం మైదానంలో ఎన్నడూ ఎదుర్కొనని బృహత్కరమైన సన్నివేశం జరిగింది. ఇప్పటి వరకు సింహాల దాటికి పరుగులెత్తే వారిని చూసిన కన్నులు ఆ సింహాల పళ్ళ మధ్య నలగడానికి సిద్ధపడి నిలబడిన వ్యక్తిని చూశాయి. సంఘ నాయకులను చంపితే సువార్త, క్రైస్తవ విశ్వాసం ఆగిపోతుందని భ్రమించిన రాజ్యానికి ఉలిక్కిపడే సంఘటనలు ప్రారంభమైన రోజు అది. శ్రమలను గూర్చిన భయాందోళనలతో నిండిన క్రైస్తవ సంఘం హత సాక్షులయ్యేందుకు ధైర్యాన్ని నింపింది ఆయన మరణం. ఆయనే ఆదిమ అంతియొకయ సంఘ నాయకుడు బిషప్ ఇగ్నేషియస్.

చరిత్రకారులు ఇచ్చిన ఆధారాల ప్రకారం ఇగ్నేషియస్ క్రీస్తు శకం 30 లేదా 35 సం॥ల మధ్య కాలంలో రోమాలో జన్మించాడు. మొట్టమొదట క్రైస్తవులుగా పిలవబడిన అంతియొకయలో పేతురు తర్వాత మూడవ తరం బిషప్‌గా ఇగ్నేషియస్ ఉన్నాడు. (యుసేబియస్ మరియు ఇగ్నేషియస్ లేఖల ప్రకారం). ఇతడు మధ్యధరా సముద్ర తీరంలో సిరియాను ఆనుకొని ఉన్న అంతియొకయలో ఏర్పడిన గృహ సంఘాలకు బిషప్‌గా వ్యవహరిస్తూ వచ్చాడు. రోమన్ ట్రేజన్ అనే చక్రవర్తి పరిపాలిస్తున్న కాలంలో తన 70వ ఏట క్రైస్తవ విశ్వాసం నిమిత్తమై బంధింపబడి అంతియొకయ నుండి సముద్ర మార్గం గుండా రోమాకు ప్రయాణం చేశాడు. ఈ ప్రయాణంలో ఆరు పత్రికలు సంఘాలకు, ఒక పత్రిక స్ముర్నలోని సంఘ నాయకుడైన పోలికార్పుకు రాశాడు. ఆ పత్రికల వివరములు 1.ఎఫిషియన్స్ 2.మెగ్నీషియన్స్ 3.ట్రాలియన్స్ 4.రోమన్స్ 5.ఫిలథెల్పియన్స్ 6.స్ముర్నలోని సంఘాల వారికి, 7.పోలికార్ప్.

### ఆదిమ సంఘ విశ్వాస ప్రమాణంపై ఇగ్నేషియస్ ప్రభావం

ఆ నాటి క్రైస్తవ మత విశ్వాసాలకు కొన్ని వ్యతిరేక బోధలు ఏర్పడ్డాయి. వాటిలో ముఖ్యంగా

డోసిటిజం, క్రీస్తు అవతారం, మరణం అనే అంశాల చుట్టూ ఉన్న ప్రతిపాదనలకు ఇగ్నేషియస్ "యేసుక్రీస్తులో దైవమానవ స్వభావాల ఐక్యత" ఉందని ధృవీకరించి గట్టిగా బోధించాడు. ఈ ద్వంద్వస్వభావాన్నే హైపోస్టాటిక్ యూనియన్ అని పిలుస్తారు. అప్పటి ఆర్థోడాక్స్ క్రైస్తవులు కూడా ఈ స్వభావాన్ని నమ్మారు, దీనిని ఇప్పుడు మనం క్రీస్తు శాస్త్రంలో కూడా చదువుకొంటున్నాం.

అప్పటి సంఘంలో ఏర్పడిన హెలెనిస్టిక్ క్రైస్తవ్యం గురించి, సంఘం పరిధిలో క్రీస్తు తత్వాన్ని, క్రీస్తు సంఘం యొక్క పాత్రను ఇగ్నేషియస్ తన పత్రికల్లో వివరించాడు. అలాగే శరీరం, ఆత్మ గూర్చిన వివరణను కూడా పత్రికల్లో వివరించాడు. రోమా సంఘంలోకి లోకం దాని ఆచారాలు ఎలా ఇమిడిపోయాయో చెబుతూ వాటికి సమాధానాలను చూపిస్తూ పత్రికలో పొందుపరిచాడు.

క్రైస్తవ్యానికి వ్యతిరేకత వాదనలైన జ్ఞానవాదం, యూదా క్రైస్తవ్యం, హెలినిస్టిక్ జుడాయిజం మరియు సంస్కృతులను గూర్చిన ఎన్నో అంశాలను అతను తన పత్రికల్లో పొందుపరిచాడు. ఇప్పటి భారత దేశంలో పేరుగాంచిన యోగాను గూర్చి కూడా ఆనాడు ఇగ్నేషియస్ తన పత్రికల్లో రాసి పెట్టాడు. శరీర సంబంధమైన ఏ ప్రయత్నం కూడా ఆత్మను శాంతింప చేయలేదని ఆత్మను కలుగజేసిన దేవుడు మాత్రమే దానికి శాంతి కలిగించేవాడని, క్రీస్తు ద్వారానే పరలోకమని, పునర్జన్మలు లేవని క్రీస్తు పునరుత్థానము ద్వారానే మనుషులకు కూడా పునరుత్థానముందని ఖండితంగా తన పత్రికల్లో రాసి పెట్టాడు.

### ఇగ్నేషియస్ మరణం

రోమా చక్రవర్తి అయిన ట్రేజన్ పరిపాలన కాలంలో క్రీ.శ 117లో అంతియొకయలో క్రైస్తవుల మీద జరిగిన హింస ఫలితంగా కొలీజియంగా పిలవబడే మైదానంలో సింహాలకు ఆహారంగా వేయబడి హతసాక్షిగా మరణించాడని మొదటి శతాబ్దంలోని చరిత్రకారులు, క్రైస్తవ మత నాయకులైన పోలికార్ప్ ఆరిజన్, యూసిబిస్‌లు చెప్పారు.

ఇగ్నేషియస్ తన బలిదానాన్ని నిరోధించే ఏ ప్రయత్నాన్ని చేపట్టవద్దని రోమా సామ్రాజ్యంలోని క్రైస్తవ సమాజాన్ని వేడుకొన్నాడు. ఇది మొదటి రెండు శతాబ్దాల్లో విశ్వాసుల సాధారణ కోరికను




సూచిస్తుంది. ఈ వాంఛ కేవలం పరిపూర్ణత కోసం ఒక సన్యాసి చేసే ప్రయత్నం, నైతిక ఆకాంక్షపై ఆధారపడి లేదు కానీ క్రీస్తును అనుకరించే వారి క్రియా రూపకమైన విశ్వాసాన్ని తేటపరుస్తుంది.

ఇగ్నేషియస్ పలికిన మాట "నేను దేవుని చేతిలో గోధుమ గింజను, విరిగిన స్వచ్ఛమైన రొట్టెను. క్రూర మృగాలకు ఆహారంగా మారడానికి ఇంకా ఎందుకు సంకోచం" (ఇగ్నే. రోమ్. 4:1). ఇగ్నేషియస్ యొక్క జీవితం త్వరగా వ్యాప్తి చెందింది. అతని మరణం తర్వాత అతని ఉత్తరాలు ఫిలిప్పీయులకు, స్మూర్నలోని పోలికార్ప్‌కు చేరి వారి ద్వారా ఆనాటి సంఘంలో ఎంతో ప్రభావాన్ని చూపించాయి. క్రీస్తులో జన్మిస్తే క్రీస్తులో జీవిస్తాం, క్రీస్తులో జీవిస్తే క్రీస్తులో మరణిస్తాం అని నమ్మిన వ్యక్తి, క్రీస్తు కొరకు జీవించడంలో, క్రీస్తు కొరకు మరణించడంలో కూడా విశ్వాస వీరుడే అని అతని గురించి ఆదిమ సంఘం చెప్తుంది. తాను దేవునిని కలిగినవాడని తెలియజేసు కోవడానికి 'గాడ్ బేరర్' అనే బిరుదును పెట్టుకొని అందరూ దేవునిని కలిగి ఉండాలని బోధించాడు.

నేటి మన జీవితం, రేపటి మన మరణం క్రీస్తులోనే ఉంటుందా, విశ్వాసనీయంగా ముగుస్తుందా, నేటి మన తరానికి రాబోయే యుగానికి మన జీవితాలు పత్రికలుగా నిలుస్తాయా, చుట్టూ అలుముకున్న దుర్బోధలకు దీటుగా మన క్రైస్తవ విశ్వాసం సమాధానాన్ని ఇవ్వగలదా అని ప్రశ్నించుకొనేలా చేస్తుంది ఇగ్నేషియస్ జీవిత చరిత్ర.

– **వి. కిషోర్ బాబు,** స్టాఫ్ కోఆర్డినేటర్,
నర్సీపట్నం



# ఒప్పుకొందామా? కప్పుకొందామా?

"తొందరగా తయారవ్వు. టైమ్ అవుతోంది"

"ఒక పది నిమిషాల్లో రెడీ అవుతాను"

"ఏం సర్దుతావో తెలియదు. మనం వెళ్ళేసరికి ఆమేన్ అంటారు. ప్రతీవారం ఇంతే"

"అవునవును మరి! లేచిన దగ్గర్నుంచీ హాయిగా పేపరో, సెల్‌ఫోనో ముందేసుకొని కూర్చునేది నేనే"

"సర్లే... ఏమన్నా అంటే అలా అంటావు. తొందరగా కానివ్వు. అయ్యగారి వాక్యం మిస్ అయితే వారమంతా ఏదో పోగొట్టుకొన్నట్లుగా ఉంటుంది"

"ప్రతివారం మధ్యలో ఒకరోజు ఇజియఫ్‌లో వింటున్నాముగా. అది వాక్యం కాదా?"

"వాక్యం కంటే వాదనలెక్కువై పోయాయి ఈ మధ్య. ఎవర్ని బైబిల్ స్టడీ తీసుకోమని అడిగినా 'నాకు రాదు', 'నేను చెప్పలేను', 'వాక్యం చెప్పడం తప్ప ఇంకేమైనా చేస్తాను' అని వంకలు చెప్తున్నారు. చిన్నచిన్న బైబిల్ స్టడీలకే అలాగంటే పెద్ద పెద్ద కార్యక్రమాల్లో ఎలా చెప్తారు"

"అది సరేలే గానీ.. టైత్ తీసుకురానా?"

"మొదటి ఆదివారం కదా... కొంత ఇజియఫ్‌కు ఉంచి మిగిలింది తీసుకురా"

"ప్రతి నెల ఇస్తున్నాముగా. ఈ నెల టైత్ అంతా చర్చ్‌లో వేసేద్దాం"

"అలా వద్దు"

"ప్రతి నెలా ఇజియఫ్‌కి మనమే క్రమం తప్పకుండా ఇస్తున్నాం. ఎవ్వరూ ఇవ్వట్లేదు. ఇచ్చినా ఏదో మొక్కుబడిగా ఇస్తున్నారు తప్ప అందులో కమిట్‌మెంట్ లేదు"

"ఒకరికి తీర్పు తీర్చడానికి మనమెవరం? ఎవరి లెక్క వారిదే! ఎవ్వరూ ఇవ్వకపోతే యుఇయస్ఐ-ఏపికి, నేషనల్ వాళ్ళకి ఎలా పంపుతున్నారు?"

"అదే చెప్తున్నా. ఇజియఫ్‌లో ఇంతమందిమి ఉన్నాం. ఎప్పుడూ ఇచ్చినవాళ్ళే ఇస్తున్నారు. అలా వచ్చిన డబ్బుల్నే పైకి పంపుతున్నారు"

"అలా పైకి పంపించడమే కాదుగా. ఇంకా మన పరిచర్యలో చాలా అవసరాలున్నాయి. ఇవ్వగలిగిన వాళ్ళమే వంతులేసుకొంటూ, వాయిదాలేసుకొంటూ కూర్చుంటే పిల్లల్నెలా ట్రైన్ చేస్తాం? క్యాంప్‌లు జరిగినప్పుడు బోలెడు ఖర్చులుంటాయి. మనకు బయటినుంచి రావు కదా! మనమే ఇవ్వాలి. ఎవరినీ అడగడం మన పాలసీ కాదు కదా"

"క్యాంప్‌లు జరిగినప్పుడు వాటికి విడిగా గిఫ్ట్ రూపంలో ఇస్తున్నాము కదా. దాన్ని దీన్ని ఎలా కలుపుతాం"

"ఏంటీ... మనమిచ్చే కొద్ది మొత్తంతోనే అంత పెద్ద క్యాంప్‌లు జరిగిపోతున్నాయా? ఎక్కడెక్కడి నుంచో స్టూడెంట్స్‌ను తీసుకురావడానికి, క్యాంప్ జరిగే మూడు నాలుగు రోజులూ వాళ్ళకి కావల సినవన్నీ సమకూర్చడానికి చాలా డబ్బు అవసరం అవుతుంది కదా"

"ఎన్నైనా చెప్పు. ఈ నెల మాత్రం మొత్తం చర్చ్ లోనే ఇచ్చేద్దాం. మనం ఒకసారి ఆపితే ఎవరెవరు ఇస్తున్నారో, నేషనల్ వాళ్లకి ఎలా పంపిస్తున్నారో తెలిసిపోతుంది కదా"

"అలా తెలుసుకోవడానికి మనమిచ్చే టైత్ ఎందుకు ఆపాలి? మన పరిచర్యకు మనం తప్ప ఎవరూ ఇవ్వరు. పరిచర్య కోసం మనమే ప్రార్థించాలి, అవసరాలను బట్టి మన గుప్పిలి మనమే విప్పాలి. మన భారమూ, బాధ్యతా వేరు కదా! ఏమీ తెలియని వాడు ఒకసారి బోర్లాపడితే, అన్నీ తెలిసినవాడు మూడుసార్లు బోర్లాపడినట్లుగా అవుతుందేమో"

"నేను రెడీ అయ్యాను. వెళ్దాం పదండి?"

❋❋❋

"పని తొందరగా కానివ్వు. ఇజియఫ్‌కి టైం అవుతోంది"

"ఎందుకంత కంగారు? ప్రతి వారం ఇంతే కదా? మనం ముందు వెళ్ళి కూర్చుంటున్నాం. వచ్చేవాళ్ళు నెమ్మదిగా తాపీగా వస్తున్నారు"

"వాళ్ళతో మనకేంటి? మన టైమ్‌కి మనం వెళ్ళాలి కదా"

"ప్రతీ వారం అలా అనుకొనే ముందెళ్ళి కూర్చుంటున్నాం. ఒక టైమూ లేదు పాడూ లేదు. రాత్రి లేటవుతోంది. ఉదయం లేవడం, పిల్లల్ని స్కూల్‌కి రెడీ చేయడం కష్టమవుతోంది. మొన్నటికి మొన్న ప్రసాదన్న వచ్చినప్పుడు కూడా ఇలాగే చేశారు. అంతదూరం నుంచి అన్న టైమ్‌కి వస్తే మనం మాత్రం తీరిగ్గా భోజనం సమయానికి వెళ్ళాం. అన్నకు మొహం చూపించాలంటే సిగ్గేసింది"

"మనొక్కళ్ళకే కాదుగా. అందరికీ అదే ఇబ్బంది కదా"

"అటువంటప్పుడు టైమ్ మార్చుకోవాలి. ఏదో ఒక వారమంటే ఏదో అర్జెంట్ పని తగిలి రాలేదనుకోవచ్చు. ప్రతీవారం అలాగే చేస్తే ఎలా? వ్యక్తిగతంగా పనులకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో ఇజియఫ్‌కు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి కదా"

"సరేలే... ఎవరి పనులు వారివి! ఎవర్నంటాం? ఇవాళ బైబిల్ స్టడీ సుమంత్ అన్నదనుకుంటా"

"సుమంతన్నా... అయితే చచ్చాం పో. లా పాయింట్లన్నీ లాగీలాగీ వదిలేసరికి ఎంత రాత్రవుతుందో చెప్పలేము"

**"ప్రభువా! మీ మాటల్ని గుమ్మాల మీదా, గోడల మీదా ఉంచి తృప్తిపడుతున్నాం గానీ మనసారా గుండెల్లోకి ఆహ్వానించ లేకపోతున్నాం. వ్యక్తిగత సౌకర్యాలపై పెట్టినంత శ్రద్ధ, టైమ్ నీ పరిచర్యకు ఇవ్వలేకపోతున్నాం. ఈ సంవత్సరమైనా నేను ఫలవంతమైన కాపు కాయడానికి కృపను అనుగ్రహించు.**

"అలా చెప్పడం కూడా దేవుడిచ్చిన టాలెంటే కదా. మనకెలాగూ రాదు. పైగా విద్యార్థుల్ని దేవునిలోకి ఎలా నడిపించాలో చక్కగా చెప్తారు కదా. ఆయన భారం మనకెలాగూ లేదు. వినడానికి కూడా ఇబ్బందేనా?"

"వింటున్నారు కదా అని మరీ సాగదీసి రాత్రంతా కూర్చోబెట్టి చెప్తారా?మన పద్ధతిలో మనకిచ్చిన సమయాన్ని కూడా చూసుకోవాలి కదా?"

"అవన్నీ మనకెందుకులే, బయల్దేరు"

❋❋❋

''అన్నా.. వచ్చేవారం బైబిల్ స్టడీ మీరే తీసుకోవాలి?"

"అయ్యో అన్నా.. నేనా? వేరేవాళ్ళని అడిగితే బాగుంటుందేమో అన్నా?"

''అందరూ తీసుకోవాలన్నా. ఆ వరసలోనే మిమ్మల్ని కూడా అడుగుతున్నా"

"టైమెక్కడ ఉంటుందన్నా? చూస్తూనే ఉన్నారుగా! నెత్తిమీద పిడుగులు పడినట్లుగా ఎప్పుడో ఏదో ఒక పని తరుముతూనే ఉంది. కుదురుగా కూర్చుని ప్రిపేర్ అవడానికి టైమే కుదరట్లేదు"

"ఎన్ని పనులున్నా మన పని చేయాల్సిందేగా అన్నా. ప్రిపేర్ అవ్వండి"

"అక్కా.. మీరు బైబిల్ స్టడీ తీసుకొంటున్న హాస్టల్ వివరాలు చెప్పండక్కా. మీకు మెసేజ్ పెట్టాను. చూసినట్లు లేరు. మీ నుంచి రిప్లై రాలేదు"

"నేను కావాలనే రిప్లై ఇవ్వలేదన్నా. పనులన్నీ మానుకుని ఎవరు చెప్తారన్నా. ఎక్కడో ఒకచోట రాసుకోవాలి. అంతేగానీ అస్తమానం ఇబియస్ లెన్ని, బిబియస్ లెన్ని, క్యాంప్‌లెన్ని జరిగాయి, ఎంతమంది పిల్లలు వచ్చారు, చేతులెంతమంది ఎత్తారని అడిగితే ఎలా?"

"లెక్క మారుతూ ఉంటుంది కదక్కా. అందుకే అడుగుతున్నా"

"ఒకటి అటో ఇటో అవుతుంది. అంతకు మించి ఏముంటుంది?"

"అటో ఇటో అయిన లెక్కే చెప్పమంటున్నాను అక్కా"

"మెసేజ్ చేస్తానన్నా"

"థాంక్స్ అక్కా"

***

"ఈ నెలతో మన పాత కమిటీ స్థానంలో కొత్త కమిటీ రావాలి".

"రమణన్నా... మీరు సీనియర్ అడ్వైజరుగా ఉంటే బాగుంటుందన్నా"

"అమ్మో అంత మాటనకన్నా. నేనింకా చాలా నేర్చుకోవాలి. అప్పుడే బాధ్యతలంటే కష్టమన్నా. పైగా రోజూ డ్యూటీ కోసం ముప్పై కిలోమీటర్లు జర్నీ చేసి వచ్చేసరికి ఇబ్బందయిపోతోంది. దానికి తోడు ఈ బాధ్యతలంటే కష్టమన్నా. వచ్చే ఏడు తప్పకుండా తీసుకుంటానన్నా"

"రవన్నా... మీరు ఈ సంవత్సరం సెక్రటరీగా ఉంటే బాగుంటుంది"

"బాబోయ్ వద్దన్నా. సెక్రటరీకి రాతకోతలెక్కువుంటాయి. వేరేదేదైనా తీసుకుంటాను"

"అయ్యో అలాగంటే ఎలాగన్నా? మనది 'షేర్డ్ లీడర్షిప్'. ఏ బాధ్యతా ఎప్పుడూ ఒకరి చేతుల్లోనే ఉండకూడదు. మనిషి మారినప్పుడు ఆలోచనలు మారతాయి. పరిచర్యలో కొత్తదనం వస్తుంది. ఉద్యోగంలో వచ్చే ప్రమోషన్ కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తుంటాం! నలుగురి మెప్పు కోసం మనం చేసే ఉద్యోగాన్ని ఎంతో బాధ్యతగా చేస్తుంటాం! పరిచర్యను కూడా అంత ప్రాధాన్యతాంశంగా తీసుకోకపోతే ఫలితాలు రావన్నా"

"............"

***

"నా మీద బాగా కోపంగా ఉందా?"

"ఎందుకు?"

"నేనేదో గొప్పవాడినైనట్లు ఇవన్నీ చెప్తున్నాను కదా"

"అప్పుడప్పుడూ రివ్యూ చేసుకోవడం మంచిదేగా! ఎక్కడున్నామో, ఎలా చేస్తున్నామో, ఎలా చేయాలో తెలుస్తుంది. దారి సరిచేసు కోవడానికి అవకాశం దొరుకుతుంది"

"అవును.. మిగతా అన్నిటికంటే మన పరిచర్య భిన్నమైంది కదా! గ్రాడ్యుయేట్స్, వాళ్ళు రెగ్యులర్‌గా చేస్తున్న పని కాకుండా తమకున్న సమయాన్ని, ధనాన్ని త్యాగపూరితంగా మన పరిచర్య కోసం వెచ్చిస్తున్నారు. కుటుంబాన్ని, ఉద్యోగాన్ని, పరిచర్యను బ్యాలెన్స్ చేసుకొంటున్నారు. ఏ పని చేసినా ఏవో లోపాలుంటూనే ఉంటాయి. అంతమాత్రాన వాటినే పట్టుకొని వేలాడడం కూడా మంచిది కాదు. చేసేది చిన్న పనైనా కమిట్‌మెంట్‌తో చేస్తే మంచిదనే ఆశ తప్ప ఇంకేమీ లేదు"

"అవునవును"

"అందుకే మీ అందరికీ చెప్పేముందు నేను కూడా ప్రార్థనలో కూర్చుని నన్ను నేను పరీక్షించుకోవాలని చూస్తున్నాను"

"ఏమని ప్రార్థన చేస్తావ్?"

"ప్రభువా! మీ మాటల్ని గుమ్మాల మీదా, గోడల మీదా ఉంచి తృప్తిపడుతున్నాం గానీ మనసారా గుండెల్లోకి ఆహ్వానించ లేకపోతున్నాం. వ్యక్తిగత సౌకర్యాలపై పెట్టినంత శ్రద్ధ, టైం నీ పరిచర్యకు ఇవ్వలేకపోతున్నాం. మొక్కుబడి దశమభాగాలు, మొక్కుబడి పరిచర్యలకు అలవాటు పడిపోయాం. ఆత్మల్ని సంపాదించాలనే భారం రోజురోజుకూ తగ్గిపోతోంది. పీఠాల మీద ఉన్న శ్రద్ధ నిన్ను ప్రకటించడం మీద లేదు. ప్రార్థన చేయడానికి టైమ్ లేదు, హాస్టల్స్‌కి వెళ్ళడానికి తీరికలేదు, ప్రేయర్ వాక్స్ లేవు, పిల్లల్ని వెదకాలనే ఆశలేదు. జీవితాన్ని 'బిజీ' అనే పరుగు ఆక్రమించింది. ఎక్కడికి పరుగిడుతున్నామో, దేనికోసం పరుగిడుతున్నామో తెలియనంత అయోమయంలో పడిపోతున్నాం. ప్రభువా! ఈ సంవత్సరమైనా నేను ఫలవంతమైన కాపు కాయడానికి కృపను అనుగ్రహించు. మనుషులకు కాదు, నీకు లెక్క అప్పగించాలనే స్పృహను కలిగించు. నశించిపోతున్న విద్యార్థుల్ని వెతకాలనే ఆశను రగిలించు. నూతన ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని మాకివ్వు".

**– డా. జడా సుబ్బారావు,** నూజివీడు



# దేహ నిర్వహణ

దేవుడు మానవుని సృజించినప్పుడు అతనిని త్రిత్వముగా అనగా మూడు భాగాలు గల వ్యక్తిగా చేశాడు. అవి అతని ఆత్మ, ప్రాణము మరియు శరీరము. ఈ మూడు భాగాలు ఒకదానితో ఒకటి అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. మనము ఆరోగ్యము గూర్చి మాట్లాడుతున్నప్పుడు ఈ మూడు భాగాల ఆరోగ్యమని అర్థం చేసుకోవాలి. మనం ఆరోగ్యంగా ఉండడం దేవుని చిత్తము. దేవుని వాక్యములోని ఆజ్ఞలు ఆరోగ్యంతో ముడిపడి ఉంటాయి. అన్ని భాగాలకు సంబంధించిన ఆరోగ్యము గురించి ఇక్కడ రాయలేము గాని కేవలం దేహ ఆరోగ్యం గురించి మాత్రమే చర్చిద్దాం.

### పరిశుభ్రత

మన దేహమునకు మనము గృహనిర్వాహకులమే గాని యజమానులము కామని దేవుని వాక్యం చెప్తుంది (1 కొరింథీ 6:19). అంతమాత్రమే కాదు, ఈ దేహము మన ఆత్మకు, త్రిత్వములోని మూడవ వ్యక్తియైన పరిశుద్ధాత్మ దేవునికి నివాసముగా చేయబడిందని దేవుని వాక్యం సెలవిస్తుంది (విశ్వాసులకు మాత్రమే). కాబట్టి ఈ దైవ నివాసాన్ని విశ్వాసులు పరిశుభ్రంగా ఉంచడం వారి విధి. అందుకే విజ్ఞులు దైవస్వభావంతో పరిశుభ్రత కలసి ఉంటుందని పలికారు (Cleanliness is next to Godliness). మన ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవడానికి క్రమశిక్షణ ఎంత అవసరమో దైవ నివాసమైన దేహాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడానికి క్రమశిక్షణ అవసరం. సోమరితనం అపరిశుభ్రతకు మూలం. విశ్వాసులకు ప్రాథమికంగా దేహం పట్ల ఉన్న దృక్పథం మారాలి. ఎవరో చూడాలి, ఎవరికోసమో శుభ్రంగా ఉండాలి అని కాకుండా, అది దేవుని నివాసమనే భావన లేకపోతే దేహం గూర్చి తగిన శ్రద్ధ వహించరు.

### ఎ. దేహము యొక్క వాసన

ఏదైనా ఒక గది చాలా రోజులు మూసివేసి ఉంచితే ఒకవిధమైన మాగుడు వాసన వస్తుంది. వెంటనే తలుపులు తీసి రూము పరిమళానికి ఏదైనా వాడి ఆ వాసన పోగొట్టే ప్రయత్నం చేస్తాము. మన దేహము అంతే. మన దేహములోనుండి అభ్యంతరకరమైన వాసనలు వస్తాయి. దానికి కారణం, మన శరీరపై భాగంలో దాదాపు 60 రకాల సూక్ష్మజీవులు ఎప్పుడూ నివాసం చేస్తూ ఉంటాయని శాస్త్రవేత్తల అంచనా. ఇవి అనుకూల పరిస్థితులు ఏర్పడినప్పుడు అభివృద్ధిచెంది, తమ విసర్జనాలను ఆ ప్రాంతంలో విడుదల చేస్తాయి. మరికొన్ని మన దేహ స్రావాలను ఆహారంగా స్వీకరించి విచ్ఛేదన (degrade) చేస్తాయి. ఆ ప్రాంతాలలో ఈ కారణాల వల్ల దుర్వాసన వస్తుంది. ఉదాహరణకు మన చెమట గ్రంధుల నుండి విడుదలయ్యే చెమటకు వాసన ఉండదు. కాని అవి బ్యాక్టీరియా జీవుల వలన విచ్ఛేదన చేయబడినప్పుడు అభ్యంతరకరమైన దుర్వాసన విడుదల అవుతుంది. సూక్ష్మక్రిములు అభివృద్ధి అవడానికి కావలసిన అనుకూల పరిస్థితులు, తేమ, దుమ్ము, మురికి, ఉష్ణ ప్రాంతమైన మన దేశంలో ఈ పరిస్థితులు అధికం. మన దేహంలో తేమ అధికంగా వుండే ప్రాంతాలు – చంకలు, గజ్జలు (Groins), జఘన స్థానం (Pubic area), పిరుదల మధ్యలో, బొడ్డు, జుట్టు ఉన్న తల భాగం.

ఈ ప్రాంతములను సాధ్యమైనంత తేమ రహితంగా శుభ్రంగా ఉంచాలి. సాధ్యమైతే ఒకటి రెండుసార్లు శుభ్రం చేసుకోవాలి. రోమాలను పెంచుకోవడం ద్వారా (చంకలలో, జఘన స్థానంలో) తేమ చేరి బాక్టీరియా అభివృద్ధి అగుటకు అవకాశం ఎక్కువ. కొందరి ప్రక్కన కూర్చోవటం చాలా కష్టతరమవటానికి ఈ దుర్వాసనే కారణం.

తేమ, మురికి ప్రాంతాలు శిలీంద్రాల స్పోరులను (Fungal spores) ఆహ్వానిస్తాయి. ఈ

ఫంగల్ స్పోరులు కంటికి కనిపించనంత చిన్నవిగా ఉండి గాలిలో లక్షలకొద్ది తేలుతూ ఉంటాయి. అనుకూల ప్రాంతాలలో అవి మొలకెత్తి శిలీంద్రాలు (బూజు)గా అభివృద్ధి చెందుతాయి. ఏలోపేషియా (Alopacea) లేక "పేనుకొరుకుడు" అనే శిలీంద్రం జుట్టు మొదళ్ళను పూర్తిగా నాశనం చేస్తుంది. కాళ్ళు పాయడం, గజ్జి, ఒక విధమైన చుండ్రు కూడా ఈ శిలీంద్రాల వలన ఏర్పడతాయి.

### తీసుకోవలసిన జాగ్రత్తలు

1. క్రమం తప్పకుండా స్నానం చేయడం చాలా ముఖ్యం. 2-5 చుక్కలు డెట్టాల్ వంటి బాక్టీరియా అభివృద్ధి నిరోధకాలను నీటిలో వేసుకొని స్నానం చేయడం చాలా సహాయకరంగా ఉంటుంది. పురుషులు కనీసం మూడు నాలుగు రోజులకు ఒకసారి తలస్నానం చేయాలి. స్త్రీలకు పొడవైన జుట్టును బట్టి అది సాధ్యం కాకపోవచ్చు గాని, చేయగలిగితే చాలా మంచిది.
2. కొన్ని ప్రాంతాలలో చేరిన మురికిని, శుభ్రంగా తొలగించకపోతే "సార్కొప్టెస్" అనే చిన్న జీవి చర్మముపై అభివృద్ధి చెంది 'గజ్జి'ని ఏర్పరుస్తుంది.
3. కొందరికి తేమలేని చర్మము జన్యుపరంగా వస్తుంది. వారు నూనెగల సబ్బులను వాడాలి. లేకపోతే చర్మపు పగుళ్ళు మురికిని ఆహ్వానించి హాని కలుగ జేస్తాయి.
4. ప్రతిరోజు షూ వేసుకొనే వారు షూస్ తరచుగా శుభ్రం చేసుకోవాలి. లేకపోతే కొందరి షూస్ భరించలేని దుర్వాసనను విడుదల చేసి వాతావరణాన్ని పాడుచేస్తాయి.
5. లో దుస్తుల విషయంలో ప్రత్యేకంగా (యౌవ్వనస్తులు, యౌవ్వనస్థురాండ్రు) తగిన జాగ్రత్త వహించాలి. ఈ దుస్తులు మల మార్గం, మూత్రమార్గములను అంటిపెట్టుకొని ఉంటాయి కాబట్టి ఈ దుస్తులు చాలా శుభ్రంగా ఉంచుకోవాలి. యవ్వనస్తులు రాత్రి వేళల్లో లో దుస్తులు ధరించకుండా నిద్రించాలి. ఫంగల్ ఇన్‌ఫెక్షన్ రాకుండా మేజోళ్ళలో, లో దుస్తులలో (Under Wears) కార్డిడా పౌడర్ చల్లుకొంటే మంచిది.
6. స్త్రీల జుట్టులో పేలు చేరే ప్రమాదం ఉంది. తప్పకుండా పేలు నివారించే లోషన్ వాడి వాటినుండి పూర్తి ఉపశమనం పొందగలం.
7. గోరులు పెంచుకోవడం నిషేధం. ఎందుకనగా వాటివలన ఎంతో ఇన్‌ఫెక్షన్ మన ఆహారం ద్వారా లోనికి వెళ్తుంది.

### బి. నోరు

మన నోరు దేహములోనికి ముఖ ద్వారము లాంటిది. నవరంధ్రాలలో ఇది అతిపెద్దది. దీని ద్వారా అధికమైన రోగ క్రిములు లోనికి ప్రవేశిస్తాయి.

ఎన్నోరకాల ఏకకణ జీవులు, బాక్టీరియా జీవులు ఇక్కడ సుఖ నివాసం చేస్తాయి. ఈ జీవులు మనం ఆహారం తిన్న తర్వాత పళ్ళ సందులలో మిగిలిపోయిన పదార్థాలపై జీవిస్తాయి. అందువలన ఆహారం తిన్న తర్వాత మరి ముఖ్యంగా స్వీట్స్ తిన్న తర్వాత తప్పక బ్రష్ చేసుకోవాలి.

ఆహారంలోని షుగర్ పదార్థంపై బాక్టీరియాలోని ఎంజైములు పనిచేసి దానిని ఒక ఆమ్ల పదార్థంగా మారుస్తాయి. ఈ ఆమ్ల (Acid) పదార్థం పంటిపై పూతను కరిగించి అక్కడ చిన్న రంధ్రం (తొర్రి) ఏర్పడుతుంది. దీనినే 'కేరీస్' లేక పన్నులో గుంట అంటారు. దానిని వెంటనే సిమెంట్‌లాంటి పదార్థముతో డెంటిస్ట్ పూడ్చివేయకపోతే తినిన ఆహారం గుంటలో ఇరుక్కుపోయి అది పిప్పన్నుగా మారుతుంది.

'సి' విటమిన్ లోపము వలన కొందరికి చిగుళ్ళ నుండి రక్తం వచ్చి దుర్వాసన వస్తుంది. పండ్ల మధ్య ఇరుక్కుపోయిన పదార్థాలను శుభ్రం చేయడానికి dental floss అనే తీగవంటి సాధనం దొరుకుతుంది. పుల్లలు, పిన్నులు ఉపయోగించడం వలన చిగుళ్ళు గాయపడతాయి.

### సి. ఆహారపు అలవాట్లు

'ఆత్మనివాసం' నిర్మించబడడానికి ఆహారం అవసరం. అహారం మూడు రకాలుగా సహాయ పడుతుంది. 1. శక్తిని అందిస్తుంది 2. నిర్మాణం, పునర్నిర్మాణానికి 3. రక్షక వ్యవస్థకు.

మానవునిలోని శక్తి వినియోగం శరీర పరిమాణం, శరీర రసాయనిక చర్యలు లింగ, వయసు, చేసే ఉద్యోగం లేక పని మీద ఆధారపడి ఉంటుంది. కావలసిన దానికంటే ఎక్కువ ఆహారం తీసుకొంటే

ఎక్కువ శక్తి రాదు సరికదా అది కొవ్వులా మారి ఊబకాయం వస్తుంది. అందుకే ఆహారం సరిపోయినంత మోతాదులో తినాలి. విశ్వాసుల్లో చాలామంది సమర్థించుకొనే పాపం 'తిండిపోతు తనం'. దేవుని వాక్యంలో అది పాపముగా ఎంచబడింది.

దేహము యొక్క అవసరాలకు సరిపోయినట్లుగా సరైన పాళ్ళలో పోషక పదార్థాలు లభించే ఆహారాన్ని సమతుల్య ఆహారం అంటారు. దేహానికి రోజునకు కనీసం 2 $^{1/2}$ లీటర్ల నీళ్ళు తాగాలి. ఆహారపు అలవాట్లు ఎంత ప్రాముఖ్యమో విసర్జన కూడా అంతే ప్రాముఖ్యం. దేహాన్ని క్రమశిక్షణతో అలవాటు చేసి సమయానికి ఆహారాన్ని ఏ విధంగా అందజేస్తామో అదేవిధంగా ఉదయ కాలంలో నిర్ణీత సమయానికి మలవిసర్జన జరగాలి. లేనిచో మలబద్దకం ఏర్పడి పైల్స్, రక్తవిసర్జన, ఫిస్టుల మొదలైన హానికర వైపరీత్యాలు కలుగుతాయి.

### డి. వ్యాయామం

విశ్వాసి తన దేహాన్ని దేవుని ఆత్మ నివాసంగా ఎంచి అనవసర పదార్థాలు తన దేహానికి ఆహారంగా పరిగణించకుండా చూసుకోవాలి. అధికమైన కొవ్వు పదార్థాలు ఆహారంలోనికి రాకుండా చూసుకోవాలి. తప్పక వ్యాయామం చేస్తూ దేహ దారుఢ్యం పెంచుకోవాలి. స్త్రీలు తమ దేహాలు అదుపుతప్పి, ఊబకాయాలుగా మారకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

### ఇ. విశ్రాంతి

ఆహారము, విసర్జన, పరిశుభ్రత ఎంత అవసరమో, దేహానికి విశ్రాంతి కూడా అంతే అవసరం. కనీసం రోజుకు 5 1/2-6గం॥ నిద్ర అవసరం. ఉదయానే 5గం॥లకు లేచి కాలకృత్యాలు తీర్చుకుని మౌనధ్యాన సమయం కలిగియుండి, కొంత వ్యాయామం చేసి పరిశుభ్రంగా స్నానం చేసి రోజును ప్రారంభించాలి.

### ముగింపు

దేహ దారుఢ్యం, ఆరోగ్యం మనం భుజించే ఆహారంపై ఆధారపడి ఉండదు. ఆ ఆహారాన్ని దీవించి, పవిత్రపరచే దేవుని కృపమీద ఆధారపడి ఉంటుంది. దానియేలు ముఖవర్చస్సు రాజు భుజించే ఆహారం వలన రాలేదు కదా! దేవునితో మనకుండే సహవాసం మన మనసును, ఆత్మను ఆరోగ్యంగా ఉంచుతుంది. మనసు, ఆత్మ ఆరోగ్యంగా ఉంటే శరీరం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. మానవుడు తినే ఆహారం వలన మాత్రమే కాక దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాట వలన జీవిస్తూ ఆరోగ్యంగా ఉంటాడు. దేవుడిచ్చిన ఈ శరీరం ఆయనకు నివాసమని ఎరిగి, బాధ్యతతో నిర్వహించి దేవునికి తోటి మానవునికి సేవచేద్దాం.

**– కె. పరిమళ దేవి,** గుంటూరు

కవిత

## దిద్దుబాటు లేకపోయినా...

దిద్దుబాటును ఇష్టపడని క్రైస్తవ సమాజం...
క్రైస్తవేతర సమాజాన్ని సరిదిద్దుతానంటోంది.

దైవవాక్యంలో ప్రస్ఫుటంగా రాసినా
దైవజనులచేత విస్పష్టంగా వింటున్నా
తనలోని లోపాలు కళ్ళెదుటే కదిలాడుతున్నా...
తప్పించుకొనే కారణాలు వెదుకుతుందే కానీ...
సరిచేసుకోవడానికి ఇష్టపడడం లేదు.

పరిశుద్ధాత్మ దేవుడు ప్రతి క్షణమూ ప్రబోధిస్తున్నా...
మనస్సాక్షి మరలా మరలా గద్దిస్తున్నా...
వాత వేయబడిన మనసాక్షిలా మారుతుందే కానీ...
లోబడే విధేయత చూపించడం లేదు.

దేవుని మాట కంటే మానవుల చేష్టలకే
ప్రాధాన్యతనిస్తూ...
దేవుని నీతి కంటే స్వనీతినే స్వేచ్ఛగా నమ్ముకొంటూ
ప్రాపంచిక పోకడలో పరుగులాడుతుందే కానీ...
ప్రభువు చెప్పిన ప్రమాణాలను పాటించడం లేదు.

ప్రకటనకూ, ప్రవర్తనకూ ఏమాత్రం సమతూకం
లేకపోయినా...
క్రైస్తవ సత్యాలు, క్రైస్తవుల జీవితాలలో నేతిబీర
చందమైనా...
క్రైస్తవులలోని లోపాలను ప్రపంచం వేలెత్తి
చూపిస్తున్నా
ప్రభుయేసుని సత్య సువార్త ప్రకటిస్తానంటోంది.
ప్రభువు దగ్గరకు ప్రజలను నడిపిస్తానంటోంది.
ప్రభుయేసుని శిష్యులుగా తయారు చేస్తానంటోంది.

**– రవికుమార్,** అద్దంకి




# అలవాట్లతో పొరపాట్లు వద్దు

ఈ వ్యాసము యొక్క ఉద్దేశం లేని దురలవాట్లు నేర్చుకోవడం కాదు. ఉన్న దురలవాట్ల నుంచి విడుదల పొందడం. ఆసక్తి కోరికలై, కోరికలు తలంపులై, తలంపులు క్రియలై, క్రియల ద్వారా సంతృప్తి, సంతోషం పొందడానికి, ఆ క్రియలే అనేక సార్లు చేయడం వలన అలవాట్లు ఏర్పడతాయి. అలవాట్లు స్వభావాన్ని ప్రభావితం చేస్తాయి. స్వభావం మన గమ్యాన్ని నిర్ణయిస్తుంది.

యవ్వనస్తులు బాల్యము నుంచి దురలవాట్లకు లోనవుతారు. శరీరము ఎదిగే కొలది సెక్స్ అనే దురలవాటుకు లోనవుతారు. అశ్లీల సాహిత్యం, అశ్లీల పటాలు చూడడానికి అలవాటు పడతారు. మొబైల్‌లో, టివిలో సినిమాలు, చెడు సాహిత్యం చదవడం ద్వారా దురలవాట్లకు లోనవుతారు. సాధారణంగా 12-15 సంవత్సరాల వయసులో ఏర్పడిన అలవాట్లు జీవితకాలం ఉంటాయి. హస్త ప్రయోగము, జారత్వము, అపవిత్రత, కాముకత్వము, కృత్రిమము మొదలగు దురలవాట్లు కొందరిలో జీవిత కాలమంతా ఉంటాయి. ఎన్ని ప్రయత్నాలు చేసినా విడుదల రాదు. రక్షణ పొందిన వారిలో కూడా ఈ దురలవాట్ల నుంచి విడుదల రాదు. ఎంత విచారకరం!

ఈ దురలవాట్లు స్నేహితుల ద్వారా వ్యాపిస్తాయి. మోసపోకుడి దుష్ట సాంగత్యము మంచి నడవడిని చెరిపి వేయును. దురాశ గర్భము ధరించి పాపమును కనగా పాపము పరిపక్వమై మరణమును కనును. ప్రతివాడు శరీర దురాశ వలన ఈడ్వబడి మరలు కొల్పబడినవాడై పాపము చేయుచున్నాడు. కొందరు దురలవాట్లతోనే చనిపోతారు. మరికొందరు రక్షింపబడి కూడా ఈ దురలవాట్లతో బలహీనమైన ఆత్మీయ జీవితాన్ని జీవిస్తారు. మరికొందరు దురలవాట్ల నుంచి విడుదల పొంది జయ జీవితము జీవిస్తారు.

నా జీవితములో కూడా 15 నుండి 31 సంవత్సరములవరకు మారుమనసు పొందకుండా సకల పాపాల్లో జీవించాను. కాని కృప చేత కనికరింపబడి 31వ ఏట ప్రభువు వైపు తిరిగాను. రక్షణ పొందిన తర్వాత కూడా అనేక పాత పాపాలు నన్ను బాధించాయి. చెత్త కుండీ దగ్గర ఆగే మున్సిపాలిటీ ఎద్దులాగా జీవించాను. ఆశ్చర్యంగా ఉంది కదూ. ఇంకా ఆశ్చర్యమేంటంటే ఇంత బలహీనతలో కూడా ఆయన మీద ఆధారపడినప్పుడు దేవుడు జయమిచ్చి తన సేవలో అద్భుతంగా వాడుకొన్నాడు. దేవునికే మహిమ.

చెడు అలవాట్ల విడుదలకు దేవుడు నాకొక సత్యాన్ని బయలుపరచాడు. విడుదల దేవుని వాక్యంలో ఉంది. "మీరు సత్యమును గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్ములను స్వతంత్రులనుగా చేయును (యోహా 8:31,32). మన విశ్వాసమెప్పుడూ దేవుని వాక్య సత్యం మీద ఆధారపడాలి. అనుభవం మీద ఆధారపడకూడదు. అనుభవమనేది వాక్య సత్యానికి విరోధంగా ఉన్నా కూడా వాక్యాన్నే నమ్మాలి. అప్పుడు పాపము మన మీద ప్రభుత్వం చేయదు (రోమా 6:14). కాని అనుభవములో పాపము ప్రభుత్వము చేస్తున్నది. గనుక మనము సత్యమునే నమ్మాలి. అలా నమ్మినప్పుడు వాక్యములోని శక్తి ప్రభావితమై చెడు అలవాట్ల నుంచి విడుదల కలుగజేస్తుంది. 'అమ్మా నీవు విడుదల పొందియున్నావు' అని ప్రభువు భూత కాలంలో చెప్పాడు. ఆమె నమ్మింది. విడుదల వచ్చింది. గనుక విశ్వాసం ద్వారానే పాపముపై జయము, పాపము నుంచి విడుదల వస్తుంది. దేవుడు నాకు ఈ సత్యాన్ని నేర్పి విడుదల ఇచ్చాడు. మీరు కూడా వాక్యాన్ని ఉన్నది ఉన్నట్లుగా నమ్మండి, జీవితాన్ని దేవునికి అప్పగించండి. అప్పుడు విడుదల కలుగుతుంది. అట్టి విశ్వాసము కొరకు ప్రార్థించండి.

దురలవాట్ల నుంచి విడుదల పొంది వాటి స్థానంలో మంచి అలవాట్లు నేర్చుకోండి. ప్రతిరోజు ఉదయం ప్రభువుకు సమర్పించుకోండి. అనుదిన వాక్య ధ్యానం చేయండి. ఎడతెగక ప్రార్థన చేయండి. ప్రతి విషయములోనూ కృతజ్ఞతాస్తుతులు అర్పించండి. ఎల్లప్పుడూ ప్రభువు నందు ఆనందించండి. ఈలాగు చేసి చెడు అలవాట్ల నుంచి విడుదల పొంది జయ జీవితం జీవించండి. దేవుడు మిమ్మును దీవించును గాక!

– జక్కి దేవరాజు, గుంటూరు

**కోశాధికారి లేఖ**

# ధారాళంగా దేవునికి ఇద్దాం

క్రీస్తునందు ప్రియమైన యుఇయస్ఐ-ఏపిలోని కోశాధికారులందరికి, సభ్యులకు
మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు నామములో శుభాకాంక్షలు.

"సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంట కోయును" – 2 కొరింథీ 9:6

కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంటకోయును, సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంట కోయును అని అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు దాతృత్వాన్ని గూర్చి చెప్పాడు. ఏ రైతు అయినా తాను నాటే విత్తనాలను లెక్కపెట్టి విత్తడం ఎప్పుడైనా చూశారా? అలా చేస్తే చాలా నష్టాన్ని కొనితెచ్చు కొంటాడు. అందుకు భిన్నంగా అతడు ధారాళంగా విత్తనాలు చల్లడం వల్ల విస్తారమైన పంట కోస్తాడు. పౌలు గారు ఈ దృష్టాంతాన్ని ఉపయోగించి ఇదే సూత్రం దాతృత్వంలో కూడా వర్తిస్తుందని చెప్పాడు. మనం కూడా దేవునికి ధారాళంగా ఇస్తే ధారాళంగానే పుచ్చుకొంటాము. చర్యకు ప్రతిచర్య ఎంత ఖచ్చితమో ఇది కూడా అంతే ఖచ్చితం. దేవునికిచ్చే ధనాన్ని పెంచడానికి నీవు సిద్ధమేనా? మన అవసరాలు ఎంత పెద్దవైనా దేవుడు వాటిని తీరుస్తాడని మాత్రం మనం ఆశించాలి.

మాసిదోనియా విశ్వాసులు బీదవారే గాని ధారాళంగా ఇచ్చారు. అలా ఇవ్వడం వల్ల ఈ లోకం ఇవ్వలేని ఆనందం, కృతజ్ఞత, సంతృప్తి వారిలో ఎక్కువయ్యాయి. గనుక మన పరిచర్య అవసరాల నిమిత్తం ధారాళంగా ఇచ్చి ప్రభువును ఘనపరుద్దాం.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి
2. స్టాఫ్‌కు ఒక ల్యాప్‌టాప్ ఇవ్వడానికి వచ్చిన రూ. 20,000/- ను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2023 తర్వాత పెరిగిన 18% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపేటట్లు
2. స్టైరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించింది. దీని అవసరత ప్రతి నెల రూ. 70,000/- పెరుగుతుంది.
4. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,00,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు

**యస్.ఆర్.డి. కిషోర్ కుమార్**

**AP MONTHLY REQUIREMENT – Rs. 18,37,000/- (18% Hike W.R.T present income)**

**MAY - 2023**

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | --- | Field Staff Salaries | 3,16,031.00 |
| General Fund | 13,97,354.00 | Field Staff HRA, CA, MA & TA | 5,15,903.00 |
| Staff Support | 85,500.00 | Office Staff Salaries | 1,60,399.00 |
| Rajasthan, Jammu & Kashmir | 45,000.00 | UESI | 4,00,000.00 |
| (Adjusted from other funds) | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Girls Depatment | 3,500.00 |
| | | To Gratuity | 50,000.00 |
| | | Office Expenditure | 34,021.00 |
| **Total** | **15,27,854.00** | | **15,27,854.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-06-2023**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# ప్రభూ...
## మళ్ళీ నాకియ్యవా!

ప్రభూ...
నన్ను క్షమించు
నిండు వలయంలా
సంపూర్ణంగా ఉన్న
నీ చిత్తాన్ని వదిలి
నిరుడు నేను విడిచి వచ్చిన
అసంపూర్తి చిత్రాల వెంట
అంతులేని ఆశతో
కొట్టుకు పోతున్నా...

అనుకూలంగా ఉన్న
నీ ఆలోచనలను కాదని
అవమానం మిగిల్చే
అల్పకాల ఆనందాల కోసం
అర్రులు చాస్తున్నా...
సజీవ యాగంగా
సమర్పించుకోడానికి బదులు
నిర్జీవ క్రియల చుట్టూ
నిరంతరం తిరుగుతున్నా...

సొంత ఇష్టాల పొరలు కమ్మిన
నా నయనాలను బాగుచేసి
నీ మనసు లోతులను
స్పష్టంగా చూసే
కళ్ళజోడు నాకియ్యవా
నీ నేత్రాలతో నన్నెలా
చూడాలనుకొంటున్నావో
అలా ఉండేలా నన్నుంచవా!
నమ్మిన తొలినాళ్ళలోని
నెమ్మదిని మళ్ళీ నాకియ్యవా...

ప్రభూ... నన్ను మన్నించి
కోల్పోయిన ఆనందాన్ని
కొత్తగా పొందుకొనేలా
నూతనంగా నన్నుంచవా!
నాలో నీ చిత్తమే సిద్ధించేలా
ఉత్తమంగా నన్నుంచవా!
విన్న వాక్యాలు తీసుకొన్న నిర్ణయాలు
నా మనో నేత్రంపై చిత్రించవా!
నా తలంపులకు నీ సమాధానాన్ని
కావలి ఉంచవా!
పరలోక ఆనందాన్ని మళ్ళీ నాకియ్యవా!

– గొంగటి మేరి జాయ్, ఆదోని